Follow: @ANNTELUGU
ANN తెలుగు
24-06-2026
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 172 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు?

- సీఎస్ నియామకంపై ఢిల్లీలో లైన్ క్లియర్
- కొత్త సీఎస్ ఎంపిక ఉత్కంఠకు తెరపడినట్లే
- ఈ నెలాఖరుతో రామకృష్ణా రావు పదవీకాలం ముగింపు
- త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు బాధ్యతలు చేపట్టేందుకు లైన్ క్లియర్ అయినట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర సీఎస్‌గా సేవలందిస్తున్న కె. రామకృష్ణా రావు పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త సీఎస్ ఎంపికపై గత కొన్ని రోజులుగా జరుగుతున్న ఉత్కంఠకు తెరపడింది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని మన్నించిన కేంద్ర ప్రభుత్వం, కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజును తిరిగి సొంత రాష్ట్ర కేడర్‌కు (తెలంగాణకు) పంపుతూ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర పరిపాలనపై సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయనను.. సీఎస్ స్థానంలో నియమించేందుకే రేవంత్ రెడ్డి సర్కార్ మొగ్గు చూపినట్లు సమాచారం. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంజయ్ జాజు మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిసింది. రాష్ట్రంలో తాజా పరిణామాలు, పరిపాలనాపరమైన అంశాలపై వీరిద్దరి మధ్య చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. సంజయ్ జాజు సీఎస్ అయితే రామకృష్ణా రావును మెట్రో రైల్ ఎండీగా నియమించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

02

టాప్ న్యూస్

## ఉద్యోగులకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్

రేపు కొత్తపథకం ప్రారంభం

02

## పేరు చెప్పండి.. గిఫ్ట్ పట్టండి



సర్కార్ వారి కానుక

02

## పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తే మంత్రులంతా ధీటుగా బదులివ్వాలి



చంద్రబాబు ఆదేశం

02

# మెట్రోపై ఫలించిన సీఎం మంత్రాంగం

## కేంద్రమంత్రి ఖట్టర్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి, ముగ్గురు కేంద్రమంత్రుల భేటీ

- కీలక అంశాలన్నీ కొలిక్కి.. చర్చలు ఫలప్రదం
- ఫేజ్-1 వాల్యూయేషన్
- ఫేజ్-2 విస్తరణకు కన్సల్టెంట్‌గా ఎస్ బీఐక్యాప్స్
- కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ
- సమన్వయ సభ్యులుగా కేంద్ర ప్రభుత్వ అధికారి... రాష్ట్ర ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ
- ముఖ్యమంత్రి... కేంద్ర మంత్రుల సంయుక్త సమావేశంలో నిర్ణయం

**ఢిల్లీ, మహా :**
హైద్రాబాద్ మెట్రోపై సీఎం రేవంత్ రెడ్డి పట్టుదల ఫలించింది. హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, విస్తరణపై కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1 స్వాధీనం.. ఫేజ్ 2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులు సమావేశమయ్యారు. సోమవారం మిగతా 2వ పేజీలో









## రేవంత్ అడిగినందుకే.. ఎక్స్‌లో కిషన్ రెడ్డి పోస్ట్

- రేవంత్ లేఖలతోనే కేంద్ర మంత్రుల భేటీ: కిషన్ రెడ్డి
- రెండుసార్లు లేఖ రాశారని ఎక్స్‌లో వెల్లడి
- అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసిన కిషన్ రెడ్డి

02



## అమరావతికి పెట్టుబడుల జోష్

- రూ.39,355 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- రాష్ట్రంలో 34,610 మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్
- ఏపీ కేబినెట్ లో కీలక నిర్ణయాలు

**అమరావతి, మహా :** ఏపీలో పెట్టుబడుల జోష్ కనిపిస్తోంది. రూ.39,355 కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం పలకడంతో ఉపాధి అవకాశాలు వెల్లువలా పెరగనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం, రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడం, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, పర్యాటక రంగం అభివృద్ధి వంటి అంశాలపై క్యాబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ క్యాబినెట్ మిగతా 2వ పేజీలో



## పుకార్లకు చెక్

- అభిమానులకు త్రిష షాక్
- విజయ్‌తో కేక్ కటింగ్ ఫోటో వైరల్
- విడిపోయారన్న ప్రచారానికి ఫుల్‌స్టాప్
- విజయ్–త్రిష బంధంపై మరోసారి ఆసక్తి
- ఫ్యాన్స్‌లో కొత్త చర్చకు తెరలేపిన పోస్ట్

02



## స్నేహానికి నిలువెత్తు నిదర్శనం వెంకయ్య నాయుడు

02

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



## సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజు అరెస్ట్

- తీవ్ర ఉద్రిక్తతల మధ్య అదుపులోకి తీసుకున్న సిట్
- విజయవాడలోని నివాసం నుంచి నాగరాజు తరలింపు
- గంటలపాటు విచారణ అనంతరం అదుపులోకి తీసుకున్న సిట్

03

## పరవాడలో తీవ్ర విషాదం

- ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం
- నలుగురు కార్మికులు సజీవదహనం
- ప్రమాద కారణాలపై దర్యాప్తు ప్రారంభం
- ఘటనపై హోం మంత్రి అనిత దిగ్భ్రాంతి

03




## తెరుచుకున్న హర్మూజ్ జలసంధి

### భారత్‌కు వస్తున్న 11 నౌకలకు లైన్ క్లియర్

02

- పునఃప్రారంభమైన అంతర్జాతీయ నౌకా రవాణా
- సురక్షితంగా జలసంధి దాటిన కార్గో నౌకలు
- ముడిచమురు సరఫరాకు ఊరట లభించిన భారత్
- చమురు మార్కెట్‌పై ఒత్తిడి తగ్గే అవకాశం



## రాష్ట్రపతితో ప్రధాని భేటీ

- కేబినెట్ పునర్ వ్యవస్థీకరణకు వేళాయె
- ఈ వారంలోనే ముహూర్తం


02



## ప్రి వెడ్డింగ్ షూట్.. ఎంత డేంజరంటే

- ప్రియుడితో కలిసి కాబోయే భార్యే..చంపేసింది
- రూ.17కోట్లతో పెళ్ళి ఏర్పాట్లు.. ఇంతలోనే

02





## ఉద్యోగులకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్

**రేపు కొత్తపథకం ప్రారంభం**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఉచిత జీవిత బీమా పథకాన్ని గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ పథకం కింద అర్హులైన ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.1.20కోట్ల వరకు ఉచిత జీవిత బీమా రక్షణ కల్పించనున్నారు. సహజ మరణం, ప్రమాద మరణం వంటి సందర్భాల్లో బీమా ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు బ్యాంకులతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

## పేరు చెప్పండి.. గిఫ్ట్ పట్టండి

**సర్కార్ వారి కానుక**

**హైదరాబాద్, మహా :** నగరంలో క్యూర్ (ఓఆర్ఆర్ లోపలి ప్రాంతం) పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టగా, ఈ కొత్త పథకానికి పేరు సూచించాలంటూ హౌజింగ్ డిపార్ట్ మెంట్ కోరింది. మంచి పేరు సూచించిన వారికి రూ.1 లక్ష బహుమతి అందజేస్తామని ప్రకటించింది. ఈ పథకానికి ప్రజల నుంచే పేరు తీసుకోవాలని బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ నెల 28 వరకూ సోషల్ మీడియా వేదికగా పోటీ నిర్వహించనున్నారు. తెలంగాణ హౌజింగ్ డిపార్ట్ మెంట్ అఫిషియల్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఎంట్రీలకు అవకాశం కల్పిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. ఆసక్తి ఉన్న వారు లక్ష ఇళ్ల పథకానికి మంచి పేరు సూచించి బహుమతిని సొంతం చేసుకోండి.

## మంత్రులంతా ధీటుగా బదులివ్వాలి

**అమరావతి, మహా :** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని ఏవైనా వివాదాలు సృష్టిస్తే వాటిని సమష్టిగా, బలంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తన కేబినెట్ సహచరులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులతో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన, ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. వైసీపీ నేరస్థులతో కలిసి రాజకీయాలు చేస్తోందని, కర్నూలు ఘటనను ఉదాహరణగా చూపుతూ కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోందని చంద్రబాబు ఆరోపించారు. ఈ క్రమంలో పవన్ కల్యాణ్‌ను వివాదాల్లోకి లాగేందుకు ప్రయత్నిస్తే మంత్రులంతా ఐక్యంగా, గట్టిగా బదులివ్వాలని సూచించారు. ప్రభుత్వంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని స్పష్టం చేశారు.

# మెట్రోపై ఫలించిన సీఎం మంత్రాంగం

(మొదటి పేజీ తరువాయి)

రాత్రి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ఉదయం కేంద్ర మంత్రి ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1 వాల్యుయేషన్... ఫేజ్ 1 స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ.. రుణ సంస్థ ఎంపిక... మెట్రో ఫేజ్ 2 విస్తరణ.. నిర్మాణ వ్యయం... అందుకు అవసరమైన రుణ సేకరణ అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ ను నియమించాలని కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్‌గా ఎస్ బీఐక్యాప్స్ ని ఎంపిక చేశారు. మెట్రో ఫేజ్ 1వాల్యుయేషన్... ఫేజ్ 2 విస్తరణ...ఇతర అంశాలపై ఎస్ బీఐక్యాప్స్ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నారు. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరు సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారు.



**ఫలించిన ప్రయత్నం**

మెట్రో టేకోవర్ ను, మెట్రో విస్తరణను కొలిక్కితెచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత కొద్దిరోజులుగా చేసిన ప్రయత్నాలు కొలిక్కివచ్చాయి. వరుసగా రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రాజకీయాలు పక్కనబెట్టి అధికారయంత్రాంగంతో చేసిన కసరత్తు, ఇతర మంత్రులతో భేటీలు మెట్రో అంశాన్ని కొలిక్కితెచ్చాయి. ఇప్పటికే మూసీ ప్రాజెక్టును దారికి తెచ్చిన సీఎం ఇపుడు మెట్రోను కూడా పట్టాలెక్కించేదిశగా సానుకూల అడుగులు వేయడం ఉత్సాహాన్ని ఇస్తోంది.

## రేవంత్ అడిగినందుకే.. ఎక్స్ లో కిషన్ రెడ్డి పోస్ట్

**ఢిల్లీ, జూన్ 23:** ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, మంగళవారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ 2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. 'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, 23వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తా' అని ఎక్స్‌లో కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



## నేడు కంది శ్రీనన్న ప్రజాదర్బార్

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే ఉద్దేశ్యంతో నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమం బుధవారం ఆదిలాబాద్ కేఎస్ఆర్ క్యాంప్ కార్యాలయం ప్రజాసేవాభవన్‌లో జరుగుతుందని కార్యాలయ ఇన్ ఛార్జి తెలిపారు. గతంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్థానికులు తరలిరాగా, ఆదిలాబాద్ ప్రాంతంలో ఈ కార్యక్రమం ఎంతో ప్రాచుర్యం పొందింది. అందరివాడుగా, ఆప్తుడుగా రాజకీయాలకు అతీతంగా కంది శ్రీనివాసరెడ్డి చేస్తున్న సేవలకు, అండగా నిలుస్తున్న తీరుకు ప్రజలు ప్రశంసలజల్లు కురిపిస్తున్నారు. ప్రజాదర్బార్ కోసం గత కొంతకాలంగా ప్రజలు ఎదురు చూస్తుండగా, బుధవారం నిర్వహిస్తున్నారు.

## తెరుచుకున్న హర్మూజ్ జలసంధి

**భారత్‌కు వస్తున్న 11 నౌకలకు లైన్ క్లియర్**

**మహా :** అంతర్జాతీయంగా ఇంధన రవాణా మార్గాల్లో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి ఎట్టకేలకు తిరిగి తెరుచుకుంది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చారిత్రాత్మక అవగాహన ఒప్పందం తర్వాత ఈ జలసంధి గుండా నౌకల రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. తాజా పరిణామంతో భారత్‌కు ముడిచమురు, ఇతర సరుకులతో వస్తున్న 11 వాణిజ్య నౌకలు సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటేశాయి. గత కొన్ని రోజులుగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య పెరిగిన తీవ్ర ఉద్రిక్తతల కారణంగా హర్మూజ్ జలసంధి నుంచి రవాణా పూర్తిగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. దీంతో అంతర్జాతీయంగా చమురు సరఫరా వ్యవస్థ స్తంభించిపోవడంతో పాటు భారత్ వంటి ప్రధాన దిగుమతి దేశాలపై తీవ్ర ఒత్తిడి పడింది. తాజాగా ఇరు దేశాల దౌత్యవేత్తలు జరిపిన చర్చలు విజయవంతం అవ్వడంతో హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ సమ్మతించింది. దీంతో భారత్‌కు వస్తున్న మొదటి విడత 11 కార్గో, ఆయిల్ ట్యాంకర్ నౌకలు హర్మూజ్ జలసంధిని దాటి భారత్ వైపు ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ పరిణామం భారత ఇంధన మార్కెట్‌కు, చమురు శుద్ధి సంస్థలకు గొప్ప ఊరటనివ్వనుంది.

## పుకార్లకు చెక్.. అభిమానులకు త్రిష షాక్

**చెన్నై, మహా :** లేటెస్ట్ ట్రెండింగ్ సెన్సేషన్ అందాల భామ త్రిష.. మరోసారి ఎప్పుడొచ్చామన్నది కాదన్నయ్య.. బుల్లెట్ దిగిందా.. లేదా అన్నట్లు.. ఒక్క ఫోటోతో సోషల్ మీడియాను షేక్ చేసేసింది. ఎప్పటినుంచో వస్తోన్న రూమర్స్ కి ఫుల్ స్టాప్ పెట్టింది. సీఎం విజయ్ తో కటీఫ్ అంటూ వచ్చిన వార్తలకు చెక్ పెట్టింది. అసలు ఒక్క ఫోటోతో ఫ్యాన్స్ ని పిచ్చోళ్ళను చేసింది. లేట్ గా వచ్చినా లేటెస్ట్ గా విజయ్ కి బర్త్ డే విషెస్ తెలిపి షాక్ ఇచ్చింది. సోమవారం విజయ్ బర్త్ డే కి త్రిష విష్ చేయకపోవడం, ఇన్స్టాగ్రామ్ లో విజయ్ ని అన్ ఫాలో చేయడంతో.. వీరు విడిపోయారని ఫ్యాన్స్ కన్ఫర్మ్ చేసేశారు. ఇక తాజాగా వారందరినీ పిచ్చోళ్ళను చేస్తూ త్రిష.. విజయ్ తో ఉన్న ఫోటోను షేర్ చేసింది. విజయ్ తో కేక్ కట్ చేయిస్తున్న ఫోటోను షేర్ చేస్తూ 'వీటన్నింటి విలువ పెంచే వ్యక్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు అని లవ్ సింబల్ ని జతచేసి మరీ క్యాప్షన్ పెట్టింది. ఇక ఫోటోలో నవ్వులు చిందిస్తూ విజయ్.. ఆయననే ప్రేమతో చూస్తూ త్రిష అద్భుతంగా కనిపించారు. ఈ ఒక్క ఫోటోతో త్రిష.. కొన్నిరోజుల నుంచి వచ్చిన రూమర్స్ అన్నింటికీ చెక్ పెట్టేసింది. విజయ్ త్రిష విడిపోవడం కుదరదు అని సింబాలిక్ గా చెప్పేసింది.

## ప్రి వెడ్డింగ్ షూట్..ఎంత డేంజరంటే

మహా : మహారాష్ట్రలో సంచలనం సృష్టించిన యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ మృతి కేసులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తొలుత ప్రమాదవశాత్తూ లోయలో పడి చనిపోయాడని భావించగా పథకం ప్రకారం చేసిన హత్యగా పోలీసులు తేల్చారు. కేతన్‌కు కాబోయే భార్య సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి కలిసి ఈ హత్యకు కుట్ర పన్నినట్లు దర్యాప్తులో వెల్లడైంది. దీంతో ఇరువురినీ పోలీసులు అరెస్ట్ చేశారు. పుణె జిల్లా గహుంజే ప్రాంతానికి చెందిన 26 ఏళ్ల కేతన్ అగర్వాల్ తమ కుటుంబం నిర్వహిస్తున్న రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ ఏడాది నవంబరులోనే సియా గోయల్‌తో అతని వివాహం జరగాల్సి ఉంది. దీని కోసం రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో అత్యంత వైభవంగా పెళ్లి ఏర్పాట్లు కూడా చేశారు. అతిథుల కోసం ఏకంగా రూ. 17 కోట్ల విలువైన ప్యాలెస్‌ను బుక్ చేయడమే కాకుండా వారిని తీసుకెళ్లేందుకు ప్రత్యేక విమానాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిసింది. అయితే జూన్ 18న లోహగఢ్ కోట వద్ద కేతన్ 400 అడుగుల లోయలో పడి మృతి చెందాడు. ఫొటోలు దిగుతుండగా కేతన్ ప్రమాదవశాత్తూ లోయలో జారి పడిపోయాడని సియా గోయల్ చెప్పగా పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కానీ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేయగా అసలు విషయం బయటపడింది. సియా గోయల్ కొంత కాలంగా చేతన్ చౌదరితో ప్రేమలో ఉన్నట్లు తెలిసింది. కుటుంబ సభ్యుల ఒత్తిడితో కేతన్‌తో నిశ్చితార్థం జరిగినప్పటికీ, అతడిని పెళ్లి చేసుకోవడం సియాకు ఇష్టం లేదని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే తమ ప్రేమకు కేతన్ అడ్డుగా వచ్చాడని భావించిన సియా, చేతన్‌తో కలిసి అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడైంది.

**సినిమా ట్విస్టులను తలపించేలా..**

పోలీసులకు దర్యాప్తులో మరిన్ని షాకింగ్ విషయాలు కూడా తెలిశాయి. పెళ్లికి ముందు ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్ కోసం కేతన్ సియా ఇండోనేసియాలోని బాలికి వెళ్లాలని ప్లాన్ చేశారు. ముంబై ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నాక కేతన్ పాస్‌పోర్ట్ కనిపించకపోవడంతో ఆ ట్రిప్ రద్దయింది. సియా ఉద్దేశపూర్వకంగానే పాస్‌పోర్ట్‌ను మాయం చేసినట్లు విచారణలో తేలిందని పుణె రూరల్ ఎస్పీ సందీప్ సింగ్ గిల్ వెల్లడించారు. జూన్ 19న సియా బర్త్ డే వేడుకల్ని రెండు కుటుంబాలు కలిసి నిర్వహించేందుకు ఏర్పాట్లు కూడా చేశాయి. అది కూడా సియాకు ఇష్టం లేకపోవడంతో, జూన్ 18న కేతన్‌ను లోహగఢ్ కోటకు తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం కేతన్‌ను సియా ట్రెక్కింగ్ పేరుతో లోహగఢ్ కోటకు తీసుకెళ్లింది. అప్పటికే అక్కడ చేతన్ చౌదరి వేచి ఉన్నాడు. సరైన సమయం చూసి ఇద్దరూ కలిసి కేతన్‌ను లోయలోకి తోసివేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కోటపై ట్రెక్కింగ్ చేస్తూ ఫొటోలు తీసుకుంటుండగా బలమైన గాలులతో కేతన్ కాలుజారి లోయలో పడిపోయాడని తప్పుదారి పట్టించింది. కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయగా పోలీసులు ఆమె మొబైల్ ఫోన్ డేటా సహా కాల్ రికార్డులు, లొకేషన్ వివరాల్ని పరిశీలించారు. ఈ క్రమంలోనే సియా పలుమార్లు చేతన్ చౌదరితో మాట్లాడినట్లు, ఘటన జరిగిన సమయంలోనూ అతడు కోట దగ్గరే ఉన్నట్లు తేలింది. తర్వాత ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు.

## స్నేహానికి నిలువెత్తు నిదర్శనం వెంకయ్య నాయుడు

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్, మహా :** స్నేహానికి నిలువెత్తు నిదర్శనం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సమయ పాలనలో ఆయన్ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. హైదరాబాద్‌లో 'వెంకయ్య నాయకుడు' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్, డీఆర్డీవో మాజీ ఛైర్మన్ సతీశ్‌రెడ్డి, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ''చేపట్టిన ప్రతి పదవికీ వన్నె తెచ్చిన వ్యక్తి వెంకయ్యనాయుడు. అసెంబ్లీలో ఆయన చేసిన ఉపన్యాసాలు అందరికీ ఆదర్శం. తెలుగు రాష్ట్రాల్లో నేతలు గౌరవం తగ్గించే విధంగా మాట్లాడుతున్నారు. రాజకీయాల్లోకి రావాలనుకునే వారు అసెంబ్లీలోని వెంకయ్య ఉపన్యాసాలు వినాలి. రైతులు, గ్రామాలు అంటే ఆయనకు చాలా ఇష్టం. గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు తీసుకుని గ్రామాలను అభివృద్ధి చేశారు'' అని కిషన్ రెడ్డి అన్నారు.

# రాష్ట్రపతితో ప్రధాని భేటీ

**కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు వేళాయె**
**ఈ వారంలోనే ముహూర్తం**

**ఢిల్లీ, మహా :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం భేటీ అయ్యారు. 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం అనంతరం రాష్ట్రపతి భవన్‌లో ఈ సమావేశం జరిగింది. కేంద్ర మంత్రివర్గం పునర్వ్యస్థీకరణ ఊహాగానాల వేళ ఈ భేటీ జరగడం ఆసక్తికరంగా మారింది.

కేరళకు చెందిన బీజేపీ నేత జార్జ్ కురియన్ కేంద్ర సహాయ మంత్రి పదవికి మంగళవారం ఉదయం రాజీనామా చేయగా, దీనికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఈ పరిణామంతో కేంద్రమంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ తథ్యమని తేలిపోయింది. ఇటీవల పలువురు కేంద్రమంత్రులకు వారి వారి రాష్ట్రాల్లో పార్టీ బాధ్యతలను అప్పగించడం దీనికి మరింత బలం చేకూరింది. కేంద్ర రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రిగా ఉన్న హర్ష్ మల్హోత్రాను ఢిల్లీ భాజపా అధ్యక్షుడిగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మే నెలలో నియమించారు. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో మరింత మంది మంత్రులకు పార్టీ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం జరుగుతోంది. దీంతో రాబోయే రోజుల్లో మరికొంతమంది తమ మంత్రి పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అదే సమయంలో కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటారన్న ప్రచారమూ జరుగుతోంది. వివిధ పార్టీల నుంచి బీజేపీలోకి, ఎన్డీయేలోకి వచ్చిన వారిని కేబినెట్‌లోకి తీసుకుంటారని జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ రాష్ట్రపతి భేటీ కావడంతో త్వరలోనే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉండొచ్చన్న సంకేతాలు ఇచ్చినట్లయ్యింది. త్వరలో ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవా వంటి రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనుండగా, ఇటీవల కాలంలో పలు విలీనాలు కూడా జరిగాయి. ఈ వారంలోనే విస్తరణ ఉండే అవకాశాలున్నాయి.



# అమరావతికి పెట్టుబడుల జోష్

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో నిర్ణయం తీసుకున్న అంశాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

**పెట్టుబడుల జాతర**

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ సిఫారసు చేసిన పలు ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. మొత్తం రూ.39,355 కోట్ల పెట్టుబడులతో, 34,610 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**అనుమతిచ్చిన కీలక ప్రాజెక్టులు ఇవే**

- ప్రీమియర్ ఎనర్జీస్ (తిరుపతి): రూ.3,936 కోట్ల పెట్టుబడితో సిలికాన్ వేఫర్, మాడ్యూల్ తయారీ యూనిట్. 540 మందికి ఉపాధి.
- కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ (అనకాపల్లి): రూ.2,788 కోట్ల పెట్టుబడితో 1000 మెగావాట్ల డేటా సెంటర్.
- ప్రొటేరియల్ ఇండియా (అనకాపల్లి): రూ.2,250 కోట్ల పెట్టుబడితో నియోడిమియం ఐరన్ బోరాన్ మాగ్నెట్ తయారీ పరిశ్రమ. 530 మందికి ఉపాధి.
- ఎస్ ఎఫ్ వోన్ ఇండియా (కాకినాడ): రూ.1,900 కోట్ల పెట్టుబడితో వాడిన వంట నూనెల నుంచి విమాన ఇంధనం తయారు చేసే యూనిట్. 2,500 మందికి ఉపాధి.
- ఎన్ఎస్ మాగ్నటెక్ (తిరుపతి): రూ.1,250 కోట్ల పెట్టుబడితో రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ తయారీ. 400 మందికి ఉపాధి.
- ఏపీ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ (ప్రకాశం): రూ.1,230 కోట్లతో స్టీల్ బెనిఫికేషన్ ప్లాంట్.
- వీటితో పాటు రేర్ ఎర్త్ మెటల్స్ వెలికితీత, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికంగా ఎండ్‌టుఎండ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



**అమరావతి రయ్ రయ్**

ఐదేళ్లుగా నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు క్యాబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది.

అమరావతిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ కోసం గతంలో టాబ్ బ్రీడ్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 35,000 టన్నుల సామర్థ్యంతో కొత్త వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం. ల్యాండ్ పూలింగ్ రైతులకు కేటాయించిన ప్లాట్లలో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల పనులకు సంబంధించిన టెండర్లకు ఆమోదం.

రైతుల ప్లాట్ల సరిహద్దుల వివాదాలను పరిష్కరించేందుకు అవసరమైన రెక్టిఫికేషన్ డీడ్‌లపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి మినహాయింపు.

పనుల పర్యవేక్షణ కోసం ఏపీసీఆర్‌డీఏలో 95 తాత్కాలిక పోస్టుల (డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు) మంజూరు.

ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ భవన నిర్మాణానికి రూ.130.38 కోట్లకు టెండర్ ఆమోదం.

**ఉద్యోగులపై వరాల జల్లు**

ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లపై క్యాబినెట్ సానుకూలంగా స్పందించింది. 2004కు ముందు నోటిఫికేషన్ పొంది, ఆ తర్వాత నియామకం అయిన 2003 డీఎస్సీ టీచర్లు, 10/99 గ్రూప్1 ఉద్యోగులు సహా మొత్తం 10,715 మంది సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. షెడ్యూల్ 9, 10 పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 62 ఏళ్లు పూర్తికాని రిటైర్డ్ ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరేందుకు అవకాశం కల్పించారు.

**పోర్టులు, పర్యాటకం, ఇతర నిర్ణయాలు**

పోర్టుల అభివృద్ధి: కేంద్ర ప్రభుత్వ నూతన చట్టాలకు అనుగుణంగా మచిలీపట్నం పోర్టు పరిధిని 64 కి.మీ. నుంచి 15 కి.మీ.కు, రామయ్యపట్నం పోర్టు పరిధిని 51 కి.మీ. నుంచి 15 కి.మీ.కు కుదిస్తూ నోటిఫికేషన్ల జారీకి ఆమోదం. రామయ్యపట్నం పోర్టును డీబీఎఫ్ఓటీ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ఆపరేటర్ నియామకానికి ఆర్ఎఫ్‌పీ జారీకి అనుమతి.

**పర్యాటకం:** గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు 'హోమ్ స్టే', 'బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్' ఏర్పాటును సులభతరం చేస్తూ పర్యాటక పాలసీకి సవరణలు. తిరుపతి మినహా రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో బార్లు, రిటైల్ మద్యం దుకాణాల ఏర్పాటుకు నూతన విధానానికి ఆమోదం.

**రవాణా శాఖ:** ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న టూరిస్ట్ బస్సులను రాష్ట్రంలోకి ఆకర్షించేందుకు, ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ వాహనాల త్రైమాసిక పన్నును ప్రతి సీటుకు రూ.4,000 నుంచి రూ.2,500కు తగ్గింపు.

**ఆరోగ్యశ్రీ:** నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నివారించేందుకు "బిల్ డిస్కౌంటింగ్ సిస్టమ్"కు ఆమోదం. దీనివల్ల ఆసుపత్రులు ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకుల నుంచి తక్షణమే నిధులు పొందవచ్చు.

**పరిపాలన:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం సహా 28 జిల్లాల కలెక్టరేట్లలో పాలనను బలోపేతం చేసేందుకు అదనపు పోస్టుల క్రమబద్ధీకరణకు ఆమోదం.

పునరుత్పాదక ఇంధనం: కడప జిల్లాలో 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఏపీఎస్పీసీఎల్‌కు భూమి కేటాయింపు. యాగంటి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని 1000 మెగావాట్ల నుంచి 1500 మెగావాట్లకు పెంచేందుకు ఆమోదం.



# పరవాడలో తీవ్ర విషాధం

**ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం**
**నలుగురు కార్మికులు సజీవదహనం**

**అనకాపల్లి, మహా :** జిల్లాలోని పరవాడ ఫార్మాసిటీలో మంగళవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. ఫార్మాసిటీ పరిధిలోని దక్షిణ ఎనర్జీ కెమికల్ ఫ్యాక్టరీలో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ విధుల్లో ఉన్న నలుగురు కార్మికులు మంటల్లో చిక్కుకుని అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. మరణించిన వారిలో ఇద్దరు కార్మికులను అచ్యుతాపురం ప్రాంతానికి చెందిన వాసులుగా అధికారులు గుర్తించారు. ప్రమాదకర గ్యాస్ లీకవుతుందని, ఫ్యాక్టరీలో మంటలు వేగంగా వ్యాపించాయని చెబుతున్నారు. మృతుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం చెల్లించాలని సెజ్ అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.

**మంటల్లో చిక్కుకున్న మరికొందరు**

ఈ ప్రమాదంలో ఫ్యాక్టరీ లోపల మరికొందరు కార్మికులు కూడా మంటల్లో చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సాధ్యమైనంత త్వరగా అక్కడికి చేరుకున్నారు. వారు ఫ్యాక్టరీలో ఎగసిపడుతున్న మంటలను అదుపు చేయడానికి, లోపల చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడానికి తీవ్రంగా శ్రమించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలేమిటన్న అంశంపై దర్యాప్తు సాగుతోంది.

**హోం మంత్రి అనిత దిగ్భ్రాంతి**

పరవాడ ఫార్మాసిటీలో జరిగిన అగ్నిప్రమాదంపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఆమె స్పందించి సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలతో ఆమె ఫోన్‌లో మాట్లాడి, ప్రమాదం జరిగిన తీరు, అక్కడి ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు.

**ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా**

ఫ్యాక్టరీలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని హోం మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. బాధితులు, వారి కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి పారిశ్రామిక ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి అనిత పేర్కొన్నారు.



# ప్రేమనగర్‌లో 'సమస్యలపై సమరం'

**మన్నె గోవర్ధన్ రెడ్డి విస్తృత పర్యటన**

**బంజారాహిల్స్, మహా :** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారాహిల్స్ డివిజన్ ప్రేమనగర్ కాలనీలో మంగళవారం ఉదయం 'సమస్యలపై సమరం' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి కాలనీలో విస్తృతంగా పర్యటించి, స్థానికుల సమస్యలను క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. బస్తీ ప్రజలు తమ ఎదుర్కొంటున్న పలు దీర్ఘకాలిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రేమనగర్‌లో తీవ్రమైన తాగునీటి సమస్య వేధిస్తోందని, ముఖ్యంగా సాయిబాబా టెంపుల్ వెనుక భాగంలో కాలుష్య నీరు వస్తోందని స్థానిక మహిళలు ఎంజీఆర్ ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయానికి నీటి సరఫరా కాకపోవడం వల్ల పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీనిపై తక్షణమే స్పందించిన గోవర్ధన్ రెడ్డి.. వాటర్ వర్క్స్ మేనేజర్ అభిషేక్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. గత ఏడాది కాలంగా నలుగుతున్న ఈ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో ప్రమాదకరంగా మారిన పాత ఐరన్ విద్యుత్ స్తంభాలు, వెలగని వీధి దీపాలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత ఎలక్ట్రికల్ ఏఈ తో మాట్లాడిన ఎంజీఆర్.. పాత ఐరన్ స్తంభాల స్థానంలో తక్షణమే కొత్త సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం శ్రీలంక బస్తీలో పర్యటించిన సమయంలో.. జీహెచ్ఎంసీ క్యాచ్‌పిట్స్ ను సకాలంలో శుభ్రపరచకపోవడం వల్ల వర్షపు నీరు రోడ్లపైనే నిలిచిపోయి ప్రజలు నరకయాతన పడుతున్న విషయాన్ని ఎంజీఆర్ గమనించారు. తక్షణమే జీహెచ్ఎంసీ ఎస్ఈ విజయ్ కుమార్, ఏఈ మోహన్ రావులతో ఫోన్‌లో మాట్లాడి, సిబ్బందిని వెంటనే అక్కడికి పంపి డ్రైనేజీ క్యాచ్ పిట్లను క్లీన్ చేయించాలని, నిలిచిన నీటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సాగిన ఈ పర్యటనలో బీఆర్ఎస్ నాయకులు రావుల విజయ్ కుమార్, ప్రభాకర్ రెడ్డి, శ్రీధర్ యాదవ్, నవీన్, నాగరాజు, రోహిత్ మరియు కాలనీవాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




# రైతులకు వ్యవసాయ ఉత్పాదకాలపై అవగాహన సదస్సు

**కార్యక్రమాన్ని ప్రారంభించిన సత్తుపల్లి ఏ.ఎం.సి చైర్మన్ దోమ ఆనంద్.**

**సత్తుపల్లి, జూన్ 23: మహా :** స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశాలతో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు ఆధ్వర్యంలో కొత్తూరు రైతు వేదిక ఆవరణలో వ్యవసాయంలో అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలు, వాటి పోషణకు ఉపయోగించే ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ మాట్లాడుతూ రైతు ముంగిట్లోకి నాణ్యమైన విత్తనాలు వ్యవసాయంలో ఉత్పత్తులు పెంచే ఎరువులను తెచ్చే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భూమి సారాన్ని పెంచే నానో డి.ఎ.పి, నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. యూరియా కొరత తగ్గించి నాణ్యమైన విత్తనాలను తక్కువ ధరకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు చలగుళ్ల కృష్ణయ్య, కొత్తూరు గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వ్యవసాయ అభివృద్ధి శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## విజయవాడలో సంచలనం రేపిన

# సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజు అరెస్ట్



**తీవ్ర ఉద్రిక్తతల మధ్య అదుపులోకి తీసుకున్న సిట్**

విజయవాడ, మహా : సంచలనం రేపిన సాయికృష్ణ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కృష్ణలంక మాజీ సీఐ నాగరాజును సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయమే సిట్ అధికారులు విజయవాడలోని సీఐ నాగరాజు ఇంటికి వెళ్లారు. అయితే సీఐ నాగరాజును అరెస్ట్ చేయవద్దంటూ ఆయన మద్దతుదారులు ఉదయం నుంచి ఇంటి వద్ద ఆందోళకు దిగారు. అయితే పోలీసు సాయంతో సిట్ అధికారులు సీఐ నాగరాజును నివాసంలోకి అతి కష్టం మీద వెళ్లారు. కేసు విషయమై కొన్ని గంటలపాటు ప్రశ్నించిన అనంతరం సిట్ అధికారులు సీఐ నాగరాజును అదుపులోకి తీసుకుని పోలీస్ గెస్ట్ హౌస్‌కు తరలించారు. నాగరాజును అదుపులోకి తీసుకునేందుకు సిట్ అధికారులు ముందుగానే వాహనం సిద్ధం చేసుకుని రావడంతో సీఐకి మద్దతుగా భారీ ఎత్తున స్థానికులు, మద్దతుదారులు వచ్చారు. నాగరాజును అరెస్ట్ చేసే అవకాశం ఉందని, అదుపులోకి తీసుకుంటారేమోనని గత మూడు రోజులుగా మాజీ సీఐ ఇంటి వద్దకు మద్దతుదారులు వచ్చి సంఘీభావం తెలుపుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి క్యాండిల్ ర్యాలీ సైతం నిర్వహించడం తెలిసిందే. ఆయన వల్లే ఏరియాలో మహిళలు ధైర్యంగా బయట తిరుగుతున్నారని, సీఐ నాగరాజు వచ్చాకే పరిస్థితిలో చాలా మార్పుల వచ్చిందన్నారు.

**సోమవారం సాయికృష్ణ కుటుంబసభ్యులను ప్రశ్నించిన సిట్**

సాయికృష్ణ అదృశ్యం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను ముమ్మరం చేసింది. సిట్ సభ్యులు సోమవారం (జూన్ 22న) కృష్ణలంకలోని సాయికృష్ణ నివాసం, పోలీస్ స్టేషన్, స్వర్గపురి శ్మశానవాటికలను స్వయంగా పరిశీలించారు. సాయికృష్ణ తల్లితో పాటు మేనమామలు, కుటుంబ సభ్యులను సుమారు 6 గంటల పాటు విచారించి వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు. పోలీసులు సాయికృష్ణను స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టి చంపేసి, ఆధారాలు లేకుండా మృతదేహాన్ని దహనం చేశారని కుటుంబ సభ్యులు సిట్‌కు తెలిపారు.

**పీఎస్ సీసీటీవీ ఫుటేజీలు మాయం**

అనంతరం క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ బృందంతో కలిసి కృష్ణలంక పోలీస్ స్టేషన్‌ను సిట్ అధికారులు ఆమూలాగ్రం తనిఖీ చేశారు. సిబ్బంది స్టేట్‌మెంట్లు, వేలిముద్రలను సిట్ అధికారులు సేకరించారు. శ్మశాన వాటిక వద్ద కాపరిని కూడా విచారించి, పరిసరాల్లోని సీసీ కెమెరాల వివరాలను ఆరా తీశారు.

**ఫుటేజీలు మాయం కావడంతో ఉత్కంఠ**

అయితే, సాయికృష్ణ కేసులో అత్యంత కీలకమైన పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీలు మాయమవడంతో ఏం జరుగుతుందోనని ఉత్కంఠ నెలకొంది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం 18 నెలల ఫుటేజీ భద్రపరచాల్సి ఉండగా, దాదాపు ఏడాది కాలపు దృశ్యాలను తొలగించినట్లు సిట్ గుర్తించింది. కోర్టు ఆదేశాల ప్రకారం హార్డ్ డిస్క్, డీవీఆర్‌లను సీజ్ చేసి పరిశీలించగా.. కేవలం 2 రోజుల ఫుటేజీ మాత్రమే లభ్యమైంది. కేసు నుంచి తప్పించుకునేందుకు మాజీ సీఐ నాగరాజు స్థానిక టెక్నీషియన్‌తో ఈ వీడియోలను తొలగించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సిట్ అదికారులు డేటా రికవరీ కోసం ఈ డేటాను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు.

## వివాహేతర సంబంధం.. కూతురును షాప్‌కు పంపి

# భర్తను చున్నీతో చంపిన భార్య

ఎల్ బి నగర్, మహా : నమ్ముకున్న భర్త, కంటికి రెప్పలా చూసుకోవాల్సిన పిల్లలు, పచ్చని సంసారం.. వీటన్నింటికంటే ఓ పరాయి వ్యక్తితో ఏర్పడిన వివాహేతర బంధమే ఎక్కువనుకుంది ఓ మహిళ. క్షణిక సుఖాల కోసం కట్టుకున్నవాడిని కడతేర్చడమే కాకుండా, ఆ పాపాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఆత్మహత్యగా నాటకమాడింది. కానీ చట్టం ముందు ఆమె నాటకాలు సాగలేదు. హైదరాబాద్ నగరంలోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన ఈ ఘోర ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

మహబూబాబాద్ జిల్లా కొరవి మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన బోడ నర్సింగ్ (36), స్వరూప దంపతులు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చిన ఈ కుటుంబం.. ఎల్బీనగర్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో నివాసం ఉంటోంది. నర్సింగ్ కూరగాయల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అంతా సవ్యంగా సాగుతుందనుకున్న తరుణంలో స్వరూపకు తన సొంత ఊరికే చెందిన మోహన్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. గత కొన్ని రోజులుగా భార్య ప్రవర్తనపై నర్సింగ్‌కు అనుమానం రావడంతో ఆమె బంధం గురించి అసలు నిజం తెలుసుకున్నాడు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ తీవ్రస్థాయిలో గొడవలు జరగడం ప్రారంభమైంది. తనకు భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన స్వరూప.. అతడిని ఎలాగైనా వదిలించుకోవాలని క్రూరమైన పథకం పన్నింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 20వ తేదీన స్వరూప తన పథకాన్ని అమలు చేసింది. ఇంట్లో భర్త ఉన్న సమయం చూసి, తన చిన్న కూతురిని ఏదో వస్తువు తీసుకురావాలని బయట ఉన్న దుకాణానికి పంపించింది. కూతురు బయటకు వెళ్లగానే, నర్సింగ్‌పై ఒక్కసారిగా దాడి చేసి తన ఒంటిపై ఉన్న చున్నీతో గొంతు నులిమి అత్యంత దారుణంగా హత్య చేసింది.

భర్త ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాక, ఏమీ తెలియనట్టుగా ఆ శవాన్ని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. అనంతరం భర్త ఆత్మహత్య చేసుకున్నాడంటూ చుట్టుపక్కల వారిని నమ్మించే ప్రయత్నం చేసింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎల్బీనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నర్సింగ్ మరణంపై అనుమానం రావడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదికలో నర్సింది ఆత్మహత్య కాదని, గొంతు నులమడం వల్లే ఊపిరాడక చనిపోయాడని వైద్యులు తేల్చి చెప్పారు. వైద్యుల నివేదిక ఆధారంగా పోలీసులు స్వరూపను తమదైన శైలిలో విచారించగా, ఆమె చేసిన పాపాన్ని అంగీకరించింది. మోహన్‌తో ఉన్న బంధానికి అడ్డు వస్తున్నాడనే భర్తను చంపేసినట్లు విచారణలో ఒప్పుకుంది. దీంతో పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ప్రియుడు మోహన్ పాత్రపై కూడా పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# యువత మత్తును వదలి క్రీడల పై దృష్టి సారించాలి

**సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత**




**వరంగల్ క్రైమ్ :** తెలంగాణ పోలీస్ శాఖ ప్రత్యేక విభాగం అయిన తెలంగాణ ఆంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జూన్ 26 వ తేదీన అంతర్జాతీయ మత్తు పదార్థాల నిర్మూలన అక్రమ రవాణా నిషేధ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా మత్తు పదార్థాల వినియోగం పూర్తిగా నిషేదించడం కోసం జూన్ 22 నుండి 26 తేదీ వరకు మత్తు పదార్థాల వ్యతిరేక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజు మత్తు పదార్థాలను నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కడిపికొండ రాజీవ్ గృహకల్ప వద్ద క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజిపేట్ ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి విచ్చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్బంగా సెంట్రల్ జోన్ డీసీపి కవిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యంగా తెలంగాణ డీజిపి సీవి ఆనంద్ ఐపీఎస్ సూచనల మేరకు వరంగల్ పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు నిబద్ధతతో పని చేస్తున్నారని తెలిపారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు వాటి వల్ల బాధపడుతూ రెహబిలిటేషన్ సెంటర్ లో ఉన్న వారి అనుభవాలను తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ బారిన పడిన వాటిని అమ్మిన కొనుగోలు చేసిన ఎవరైనా వారి వద్ద డ్రగ్స్ ఉంచుకున్న వెంటనే 1908 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా మత్తు పదార్థాలు మన దేశంలోకి ఏవిధంగా వస్తున్నాయి వాటిని ఏవిధంగా అరికట్టాలనే అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. తెలిపారు.

**అనంతరం ఏసీపి**

ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ మన దేశంలో యువత మత్తుకు బానిసలు అయి తమ భవిష్యత్తును అంధకారం చేసుకొని వారి మేధ శక్తిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో దేశంతో పాటు ప్రపంచంలో ఉన్న అత్యున్నత సంస్థలకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తులను గురించి క్షేత్రస్థాయిలో తెలిపారు. కార్యక్రమం అనంతరం క్రీడలలో గెలిచిన వారికీ బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దుర్గాబాయి దేశముఖ్ మహిళ ప్రాంగాణ ప్రిన్సిపాల్ జయశ్రీ, ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్, మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కడిపికొండ, బట్టుపల్లి, తరాల పల్లి, కుమ్మరిగుడెం గ్రామాల నుండి సుమారు 300 మంది యువకులు, మడికొండ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**మత్తు పదార్థాల పై అవగాహన కార్యక్రమం**

మడికొండ లోని టీఎస్ డబ్ల్యూ ఆర్ జె సి పాఠశాలలో పిల్లలకు మత్తు పదార్థాల నిర్మూలన కోసం పిల్లలకు అవగాహన కార్యక్రమం తో పాటు ఎస్సెయ్ రైటింగ్, క్విజ్, స్పీచ్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.



# రేవంత్ ఏ స్కీం తెచ్చినా దాని వెనుక స్కామే

**కేటీఆర్ కామెంట్స్**

హైదరాబాద్, మహా : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, "రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది" అని ఆరోపించారు. మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ.14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు. "కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్‌జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు. ఇది తుగ్లక్ నిర్ణయం" అని కేటీఆర్ మండిపడ్డారు.



## ఊరచెరువు అభివృద్ధి పనులు

# త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి**

హనుమకొండ మహా; హనుమకొండ లోని గోపాల్‌పూర్ ఊరచెరువులో కొనసాగుతున్న డీసిల్టేషన్ (పూడిక తొలగింపు), రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు.మంగళవారం హనుమకొండలోని గోపాల్‌పూర్ ఊరచెరువును సందర్శించిన కలెక్టర్, అక్కడ కొనసాగుతున్న డీసిల్టేషన్ తో పాటు రీటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యత, వేగంపై ఇరిగేషన్, జీడబ్ల్యూఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో చెరువు అభివృద్ధి పనులకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అదనపు యంత్రాలు, సిబ్బందిని వినియోగించి డీసిల్టేషన్ రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులను ఈ వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. చెరువుల పునరుద్ధరణ ద్వారా వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టం మెరుగుపడుతుందని, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిరంతర పర్యవేక్షణతో చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో జీడబ్ల్యూఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ తహసీల్దార్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పార్కుల అభివృద్ధికి ఆధునిక నమూనాలు రూపొందించాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి**

**మహా వరంగల్ కార్పొరేషన్ ;** గ్రేటర్ వరంగల్ నగరంలోని పార్కులను ప్రజలకు మరింత ఆకర్షణీయంగా, ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు ఆధునిక నమూనాలు (డిజైన్లు) రూపొందించి అభివృద్ధి పనులను చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి సూచించారు.మంగళవారం హన్మకొండ కలెక్టరేట్‌లో వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (డబ్ల్యూఆర్ఐ) ప్రతినిధులు, బల్దియా అధికారులతో నగర పార్కుల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్కుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన వినోద, విశ్రాంతి సౌకర్యాల కల్పనకు సంబంధించి పలు సూచనలు చేశారు. బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్కు అభివృద్ధికి డబ్ల్యూఆర్ఐ అందించిన ఆధునిక డిజైన్లను అనుసరించి పార్కును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అదే తరహాలో నగరంలోని ఇతర పార్కుల అభివృద్ధికి కూడా డబ్ల్యూఆర్ఐ సాంకేతిక సహకారం అందించాలని కోరారు. వరంగల్ పరిధిలోని కీర్తినగర్ పార్కుతో పాటు నగరంలోని మరికొన్ని పార్కులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను ఎంపిక చేసి వాటి అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రజల అవసరాలు, పిల్లల వినోదం, పర్యావరణ పరిరక్షణ అంశాలను దృష్టిలో ఉంచుకొని పార్కులను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు.నగరంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించే దిశగా పార్కుల అభివృద్ధి కీలకమని, ఈ కార్యక్రమంలో డబ్ల్యూఆర్ఐ పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలోడబ్ల్యూఆర్ఐ కన్సల్టెంట్ ప్రతినిధి ఎలైన్ అగీత జీడబ్ల్యూఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంతోష్‌బాబు, డిప్యూటీ ఇంజనీర్ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# ఉచితం.. అనుచితం...

**ఉచితం.. ఉచితం... ఉచితం... ఒకటి కొంటే మరొకటి ఉచితం. తెల్లవారింది మొదలు ఇలాంటి ప్రకటనలు చూస్తూ ఉంటాం. వింటూ ఉంటాం. ఇది వ్యాపార రహస్యం. లాభం లేకుండా ఏ వ్యాపారి వ్యాపారం చేయడు. ఒకటి కొంటే మరొకటి ఉచితంగా ఇస్తున్నాడు అంటే అందులో ఏదో మతలబు వుండే ఉంటుంది. ఇది మనకు తెలుసు. అయినా ఉచితం అనగానే మనసు ఊరుకోదు. అవసరం లేకపోయినా దాన్ని కోనేస్తుంటాం. ఇది మానవ నైజం. ఈ ఉచితాలే ఇప్పుడు కొంపముంచుతున్నాయి. ఉచిత ఆశలు పెరిగిపోతున్నాయి. ఇదే రాజకీయ పార్టీలకు వరంగా మారాయి. ఎన్నికలు వచ్చాయి అంటే చాలు. ఉచిత పదాలు పోటీలు పడతాయి. బియ్యం ఉచితం. ఉండేందుకు ఇళ్ళు ఉచితం. నిత్యావసర వస్తువులు ఉచితం.**



రవాణా సదుపాయం ఉచితం... ఇలా రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత హామీలు చూస్తే ఆహా జీవితంలో ఇక ఏ కష్టం లేకుండా కాలం గడిపేయ వచ్చు. ఏ పని చేయకుండా బతికేయ వచ్చు. అనే ఆలోచన ఇట్టే వచ్చేస్తుంది. ఇది సహజం. మనిషి ఆశా జీవి. ఎవరైనా ఉచితంగా ఇస్తాం అంటే చాలు. వెనక ముందు ఆలోచన చేయకుండా దాన్ని అందుకునేందుకు పరుగులు తీయటం చూస్తూనే వున్నాం. మనిషికి వున్న ఈ బలహీనత ఇప్పుడు పెద్ద ఆర్థిక సంక్షోభం వైపు నెట్టేస్తోంది అంటున్నారు ఆర్థిక నిపుణులు. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో గెలిచేందుకు ఎడా పెడా ఉచిత పథకాలు ప్రకటించేస్తున్నాయి. ప్రజలు వీటిని నమ్మేస్తున్నారు. ఓట్లు ఈ ఉచితాలపైన గుద్దేస్తున్నారు. ఇక ఈ ఉచిత హామీలపైన అధికారంలోకి వచ్చిన పార్టీలు ఇచ్చిన హామీల్లో రెండో, మూడో అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. అప్పుడు కానీ ఉచిత హామీలు ఎంతటి ఆర్థిక భారమో ప్రభుత్వాలకు, పాలకులకు తెలిసి రావటం లేదు. ఇంకేముంది. అప్పులు మొదలు పెట్టటం. అలా తెచ్చిన రుణాలు ఉచితాలపై పెట్టటం, తెచ్చిన అప్పుల భారం ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజల నెత్తిన రుద్దడం ఇప్పుడు సాగుతున్నతంతు.

ఉచితాలు అత్యంత ప్రమాదకరమంటూ ఆర్థిక నిపుణులు మొదటి నుంచి హెచ్చరిస్తూనే వున్నారు. ఇవి రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తాయని వారు అంటున్నారు. ఆర్థికంగా రాష్ట్రాలు భారీ ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంటుందని పదే పదే సూచిస్తునే వున్నారు. అయినా ఏ రాజకీయ పార్టీ పట్టించుకోవటం లేదు. అధికారం కోసం ఎలాంటి ఉచితాలు అయినా ప్రకటించేందుకు దేశంలోని రాజకీయ పార్టీలు వెనుకంజ వేయటం లేదు. రుణ మాఫీలు, ఫించన్లు, ఉచిత రవాణా మొదలుకుని కులాల వారీగా, వృత్తుల వారీగా ఉచిత పథకాలు ఇప్పుడు అనేక రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. దేశంలో ఉచితం లేని రాష్ట్రం ఒక్కటీ కూడా లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర ఆదాయం, ఖర్చులు, అభివృద్ధి అంశాలు పరిగణలోకి తీసుకోకుండా ఇప్పుడు ఉచిత పథకాలు సాగిపోతున్నాయి. ఫలితంగా అన్నీ రాష్ట్రాలు అప్పుల ఊబిలో ఇరుక్కుపోయాయి.

దేశ తలసరి ఆదాయం, రాష్ట్రాల తలసరి ఆదాయం పైన ఉచిత పథకాలు తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు ఆర్థిక నిపుణులు వివరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే ఆంధ్రప్రదేశ్ దాదాపుగా పది నుంచి పదిహేను లక్షల కోట్ల అప్పుల భారం మోస్తోంది. తెలంగాణ రాష్ట్రం దాదాపుగా ఆరు నుంచి ఏడు కోట్ల అప్పులలో వుంది. ఈ అప్పులకు నెల వారీగా కట్టే వడ్డీలు తడిసి మోపెడు అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ అప్పులు పెద్ద సంకటంగా మారాయి. అప్పులకు వడ్డీలు కట్టే నేపథ్యంలో పాలన వ్యవహారాలకు కూడా నిధులు వెతుక్కోవల్సి వస్తోంది. చివరికి ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి అంటే కూడా ఇబ్బంది గా మారింది. కొన్ని సమయాల్లో ప్రభుత్వం నడిపేందుకు, జీతాలు చెల్లించేందుకు కూడా అప్పులు తప్పట్లేదు. ఓవర్ డ్రాఫ్ట్ లు కుప్పలు తెప్పలుగా పేరుకు పోతున్నాయి. ఆదాయం ఎలా పెంచుకోవాలి. అప్పుల నుంచి ఎలా బయట పడాలి. అభివృద్ధి పనులు ఎలా ముందుకు తీసుకొని వెళ్ళాలి. ఇవే ఇప్పుడు దేశంలోని అనేక రాష్ట్రాలకు ఓ సవాల్ అవుతోంది.

దేశంలోని ఏ రాష్ట్రానికి అయినా కొన్ని ఆదాయ వనరులు ఉంటాయి. మద్యం అమ్మకాలు, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్, పన్నులు ఇలా రాబడి వచ్చే మార్గాలు వున్నాయి. వచ్చే రాబడి, రాష్ట్ర అవసరాలు, పాలనా పరమైన ఆర్థిక విధానాలు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, భత్యాలు పోనూ ఎంత ఆదాయం రాష్ట్ర ప్రభుత్వం ఖజానాలో ఉంటుందో ముందే రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు అంచనా వేస్తారు. ఈ లెక్కలు పరిగణలోకి తీసుకొని ప్రభుత్వాలు అభివృద్ధి, ఇతర పథకాలు అమలు చేస్తూ ఉంటాయి. ఇది ఒకప్పుడు జరిగిన తంతు. ఇప్పుడు ఇదేమి గమనించకుండా ఉచిత పథకాలు ప్రకటించే పరిస్థితి వచ్చింది. దీంతో ఆర్థిక వ్యవహారాలు గాడి తప్పి రాష్ట్రాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయి. రాష్ట్రాలకు వచ్చే ఆదాయం కన్నా ఉచితాలకే ఎక్కువ ఖర్చు పెట్టే పరిస్థితి వచ్చింది. ఉచిత పథకాలు అంటూ తలకు మించిన భారం నెత్తిన వేసుకుంటున్న నేతలు చివరికి రాష్ట్రాలను అప్పుల కుప్పలుగా మార్చేస్తున్నారు. ఇక ఉచిత పథకాలకు ఇప్పుడు దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు అలవాటు పడిపోయారు. ఉచితం మాట లేకుండా ఇప్పుడు ఏ ఎన్నికలు జరగటం లేదు. ఎన్నికల్లో గెలిచేందుకు చీరెలు, వంట సామాగ్రీ, విలాస వస్తువులు ఇవ్వటం ఓ ఎత్తు అయితే డబ్బులు ఇవ్వటం మరో ఎత్తుగా మారింది. ఇవి చాలవు అన్నట్టు ఉచిత హామీలు ఓ రేంజ్ లో ఇచ్చేస్తున్నాయి పార్టీలు... వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇచ్చే ఫించన్లు, ఉచిత బియ్యం, నిత్యావసర వస్తువులు ఇలా ఒకటేమిటి ఇప్పుడు ఉచితం జాబితాలో చేరనిది ఏది లేకుండా పోయింది. ఈ ఉచిత పథకాలు అమలు కోసం ఆదాయ మార్గాలు లేక పోవటంతో కనిపించిన అన్నింటి రేట్స్ పాలకులు పెంచుతూ పోతున్నారు. అంటే ప్రజలకు కుడి చేత్తో ఇచ్చి ఎడమ చేతితో లాగేసుకుంటున్నారు. ఉచిత పథకాల నియంత్రణ గుర్తించిన కేంద్రం, రిజర్వుబ్యాంకు వీటికి హద్దులు ఉన్నాయని రాష్ట్రాలను హెచ్చరించినా ఫలితం ఉండటం లేదు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత హామీలపై కోర్టులు కూడా సూచనలు చేసినా పార్టీలు పట్టించుకోవటం లేదు. ఎన్నికల్లో ఉచిత హామీలు పై ఆయా పార్టీలను నియంత్రణ చేసే దిశగా ఇప్పటి వరకు ఎన్నికల సంఘం కూడా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇదే ఉచిత హామీల కుండపోతకు దారి తీస్తోందని మేధావులు అంటున్నారు. ఉచితాలకు అలవాటు పడుతున్న ప్రజలు కష్టం చేసేందుకు ఇప్పుడు బద్దకిస్తున్నారని ఇది భవిష్యత్ లో విపరీత పరిణామాలకు దారి తీస్తుందని, ప్రజల్లో సోమరితనం పెంచుతుందని కూడా వారు అంటున్నారు.

రాష్ట్రాలు అందిస్తున్న ఉచిత పథకాలకు ప్రజలు బాగా అలవాటు పడిపోయారు. ఒక్క రోజు ఫించన్ ఆలస్యం అయినా, అందవల్సిన ఉచిత తాయిలం సరైన టైమ్ లో అందక పోయినా అగ్గి మీద గోగ్గిలం అవుతున్నారు. ఉచిత పథకాలు పొందటం తమ హక్కు, అధికారం అనే భావన ఇప్పుడు ఈ పథకాల లబ్ధిదారులలో పేరుకు పోయింది. ఉచితాల మాటునా అనర్హులు కూడా భారీగా లబ్ధి పొందుతున్నట్లు కూడా ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో చనిపోయిన 40 వేలకు పైగా మందికి ఫించన్ మంజూరు అవుతోందని, మరో 40 వేల మంది అనర్హులు చాలా కాలంగా ఫించన్ పొందుతున్నారని బయట పడింది. ఇక తెలంగాణ రాష్టంలో లేకుండానే మరో 12 వేల మంది ఫించన్ పండుతున్నారన్న నిజం కూడా బయట పడింది. అంటే ఉచిత పథకాల వెనుక ఎన్ని వేల కోట్ల నిధులు బూడిదలో పోసిన పన్నీరు అవుతున్నాయో అర్థం అవుతోంది. ఉచిత పథకాలు అనుచితమైనవని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు లాంటి అనుభవపరులు అంటున్నారు అంటే అర్థం చేసుకోవచ్చు. విద్య, వైద్యం అనేవి మాత్రమే ఉచితంగా ఉండాలని ,ఏ ఆధారం లేని వారికి, దుర్భర జీవితం అనుభవిస్తున్న వారికి కొంత మేర కు ఉచిత పథకాలు అమలు చేయండి. అంతే కానీ కనిపించిన ప్రతీ వారికి ఉచిత పథకాలు ఇచ్చి దేశం నష్టం పోయేలా చేయకండీ అంటూ సీనియర్ నేత వెంకయ్యనాయుడు చేసిన సూచనలు నిజంగా ఆచరణీయం. నిజమే.. ఉచితాలు ఎప్పటికి అయినా అనుచితాలే కదా...



జీ. వెంకటరమణ.
సీనియర్ జర్నలిస్ట్.



# మెట్రో మహా మై"త్రి"

**నేల మీద కాకుండా, నింగిలో పోకుండా నడుమ అంతెత్తు దిమ్మెల ఆధారంగా మెట్రో రైలు వ్యవస్థ భౌతిక స్వరూపం. దాని భవితవ్యం కూడా అలానే ఉట్టికి అందక, స్వర్గానికీ చేరని మాదిరిగా ఇటు ఎల్ అండ్ టీకి భారమై, అటు ప్రభుత్వానికి చేరువ కాక ప్రస్తుతం త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నది. హైదరాబాద్ లో జనాభాతో పోటీ పడుతున్న వివిధ వాహనాల సంఖ్య 96 లక్షలు. రోడ్ల మీద అవి పట్టడం లేదు. రాకపోకలు నరకప్రాయం. ఇంధనం, కాలుష్యం, జాప్యం అదనపు సవాలు. కనుచూపు మేరలో పరిష్కారం సామూహిక ప్రత్యామ్నాయ ప్రజా రవాణా మెట్రో రైలు.**

నగర సిగలో మెట్రో నగ ఇంపార్టెంటుకు ఈ ఒక్క బేస్ చాలు. ప్రసవ వేదనల వలె ట్రాఫిక్ అవస్థల విముక్తికి మానవీయ దృక్పథం, విశాల హృదయం రాజకీయ పార్టీలకు అత్యవసరం, అనివార్యం. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మూడు పార్టీలూ ఈ అంశంలో కంప్లీట్ నగర ప్రజల మేలుకై మై"త్రి" స్ఫూర్తితో పాటుపడాలి. సమీప భవిష్యత్తులోనే మూడు కార్పొరేషన్ల ఎన్నికలు ఉంటాయి. ఎవరి రాజకీయ లబ్ధి కోసం వారు తపిస్తారు. అసలే నగర పాలక ఎలక్షన్ల కాలం కాబట్టి ఫక్తు రాజకీయాలే చేస్తారు. కరెక్ట్ అయినా కాకున్నా నేతలను ఎవరూ ఆపలేరు. కానీ విజ్ఞులైన ప్రజలు మాత్రం అన్ని గమనిస్తూనే ఉంటారు. మహానగరంలో ప్రతి అడుగులోనూ తాము ఎదుర్కొంటున్న ఇక్కట్లను ఎవరు దగ్గరగా అడ్రస్ చేస్తారో, తమ అంతరంగానికి చేరువగా ఎవరు మెదులుతారో వాళ్ళనే ఆదరిస్తారు. అందువల్ల మెట్రో వ్యవహారంలో పేరు, గుర్తింపు, పలుకుబడి గురించిన బెంగ, జెలసి వంటి మనో వికారాలతో అడ్డుపుల్లలు వేసుకోకుండా, పరస్పరం నిందించుకోకుండా జనం కోణంలో గుండె తడి లీడర్లలో కావాలి. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో రాజధాని నగరానికి సంబంధించి ప్రత్యేకంగా 19 హామీలు గుప్పించింది. ఆ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో కోసం చాలా ఓపికగా మనసు పెట్టి శ్రమించాలి. ఎలాగూ ఆక్రోశం వెళ్లగక్కినందున ఇకనైనా తేలికపడాలి. రూ. 15 వేల కోట్లలో ఎల్ అండ్ టీకి కట్టాల్సిన తతిమ్మా రూ. 13,600 కోట్ల రుణం విదుదలలో ఎక్కడ మెలిక పడిందో సంయమనంతో కనిపెట్టాలి. ఢిల్లీకి 72 సార్లు పోయిన అనుభవంతో ఆనుపానులు ఔపోసన పట్టాలి. ఎదుటి పక్షాల నాయకులను శంకించే బదులు వారినే విశ్వాసంలోకి తీసుకుని సంప్రదింపులు జరుపాలి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బొంత పురుగునైనా ముద్దాడతానని ఉద్యమ కాలంలో కేసీఆర్ చెప్పేవారు. మెట్రో ఓనర్షిప్ మార్పిడి, రెండో దశ పనుల కార్యరూపం కోసం సీఎం కూడా ఆ విధంగా యద లోతుల్లోంచి చొరవ చూపాలి. కేంద్రంలో ప్రభుత్వాన్ని తమ పార్టీనే లీడ్ చేస్తున్నందున బీజేపీ రాష్ట్ర నేతలు ముఖ్యమంత్రికి పెద్ద మనసుతో ఈ అంశంలో సహకరించాలి.

మెట్రోతోనూ మన విశ్వ నగర ఉజ్వల భవిష్యత్తు ముడిపడి ఉన్నందున, బహుళ ప్రయోజనాల దృష్ట్యా సానుకూలంగా మెదలాలి. గత ప్రభుత్వంలో మెట్రో తీరుతెన్నులను దగ్గరగా చూసిన కేటీఆర్, ప్రస్తుతం కేంద్ర కేబినెట్ లో ఉన్న కిషన్ రెడ్డిల వద్దకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా వెళ్లి కలవాలి. వారిని తానే వెంటబెట్టుకొని మరీ ఢిల్లీకి పోవాలి. తదుపరి 73వ హస్తిన పర్యటనలో వాళ్ళు తన వెంట ఉండేలా చూసుకోవాలి. పార్టీలుగా రాష్ట్రం లోపల ఎటువంటి పోటీ, వైరుధ్యాలు ఉన్నప్పటికీ తమిళ నేతలు రాష్ట్ర బాగోగుల కోసం మాత్రం రాజకీయాలకు అతీతంగా ఒక్కటవుతారు. అలాగే తెలంగాణ రాజకీయ దిగ్గజాలు, పార్టీలు కూడా ఆ ఒరవడిని మనసా వాచా కర్మణా త్రికరణ శుద్ధితో పుణికిపుచ్చుకోవాలి. మెట్రో రైలు యాజమాన్య బదిలీతో పౌరులకు నేరుగా సంబంధం ఉండకపోవచ్చు. కానీ దాని నిర్వహణ తీరుతోనూ, ప్రజా రవాణాలో సౌలభ్యాల పరంగా పౌరుల గమనంలో ఓటు లంకె మాత్రం ఉంటుంది. ఆ ప్రకారమే ప్రజా తీర్పులు నమోదు అవుతాయి. ఈ సూక్ష్మం రాజకీయ పార్టీలకు తెలియదనుకోము.

ఇల్లెందుల దుర్గాప్రసాద్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440850384

# ఆంధ్రా కేజీఎఫ్ 'జొన్నగిరి'

**భారతదేశ పసిడి చరిత్రలో 'కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ ' ఒక చెరగని ముద్ర. కాలగర్భంలో ఆ గనుల తవ్వకాలు నిలిచిపోయాక, దేశీయంగా బంగారం ఉత్పత్తిలో ఏర్పడిన శూన్యతను పూరించడానికి నవ్యాంధ్ర వేదిక కాబోతోంది. దశాబ్దాలుగా కరవు రక్కసి కోరల్లో చిక్కి, వెనుకబడిన ప్రాంతంగా మిగిలిపోయిన రాయలసీమ గడ్డపై ఇప్పుడు సరికొత్త చరిత్ర లిఖించబడుతోంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరి' గ్రామం ఇప్పుడు 'ఆంధ్రా కేజీఎఫ్'గా రూపాంతరం చెందుతూ, దేశ పసిడి పటంలో ధృవతారగా వెలగబోతోంది.**

దేశంలోనే ప్రైవేట్ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ ఎత్తున రూపుదిద్దుకున్న ఈ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూన్ 24 (బుధవారం) నాడు లాంఛనప్రాయంగా ప్రారంభించనున్నారు. ఇది కేవలం ఒక పారిశ్రామిక ప్లాంట్ ప్రారంభోత్సవం కాదు.. రాయలసీమ ఆర్థిక, సామాజిక ముఖచిత్రాన్ని సమూలంగా మార్చివేసే ఒక సువర్ణ అధ్యాయం.

ప్రకృతి ప్రసాదించిన ఖనిజ సంపదను వెలికితీసి, సంపద సృష్టి చేయాలనే దృఢ సంకల్పంతో **జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టును సాకారం చేశాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దాదాపు 405 కోట్ల రూపాయల భారీ పెట్టుబడితో ఈ బంగారం శుద్ధి కర్మాగారాన్ని నిర్మించారు.

ఈ బృహత్తర ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాదాపు 1,500 ఎకరాల భూమిని కేటాయించగా, ప్రణాళికాబద్ధంగా మొదటి దశలో 600 ఎకరాలలో మైనింగ్, ప్రాసెసింగ్ పనులను ప్రారంభించనున్నారు. ఇప్పటికే నిర్వహించిన ప్రయోగాత్మక పరీక్షలు ఆశాజనకంగా, నూటికి నూరు శాతం విజయవంతం కావడంతో పూర్తిస్థాయి వాణిజ్య ఉత్పత్తికి సర్వం సిద్ధమైంది. ఇదే వేదికపై భవిష్యత్తు విస్తరణను కాంక్షిస్తూ, రెండో యూనిట్ నిర్మాణానికి కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనుండటం ఈ ప్రాజెక్టు యొక్క దీర్ఘకాలిక వ్యూహానికి నిదర్శనం.

జొన్నగిరి గనులు దేశీయ అవసరాలకు అవసరమైన బంగారాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. తొలి ఏడాదిలోనే దాదాపు 400 కిలోల మేలిమి బంగారాన్ని ఉత్పత్తి చేయాలని యాజమాన్యం పక్కా ప్రణాళికలతో సిద్ధమైంది. తదుపరి ఏడాది ఈ ఉత్పత్తిని ఏకంగా 900 కిలోలకు పెంచడం ద్వారా ప్లాంట్ సామర్థ్యాన్ని మరింత విస్తరిస్తారు. ఇలా దశలవారీగా సాంకేతిక నైపుణ్యాన్ని, మానవ వనరులను పెంచుకుంటూ.. రాబోయే కొద్ది సంవత్సరాలలోనే ఏటా 2 టన్నుల స్వచ్ఛమైన బంగారాన్ని వెలికితీయడమే పరమావధిగా అడుగులు పడుతున్నాయి. ఈ మైనింగ్ ప్రాజెక్ట్ గమన గమనాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

రాయలసీమ అనగానే ఒకప్పుడు ఉపాధి లేక వలసలు పోయే కూలీల దృశ్యాలు గుర్తొచ్చేవి. కానీ, ఈ పసిడి ప్రాజెక్ట్ స్థానిక యువత పాలిట కల్పవృక్షం కానుంది. ఈ కర్మాగారం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 700 మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సాంకేతిక, పరిపాలనా విభాగాలతో పాటు మైనింగ్ ప్రక్రియలో స్థానిక నైపుణ్యం కలిగిన యువతకు పెద్దపీట వేయడం ద్వారా, ఈ ప్రాంతంలో ఆర్థిక స్థిరత్వం ఏర్పడటమే కాకుండా వలసల నివారణకు ఒక శాశ్వత పరిష్కారం లభించనుంది. ఈ ప్రాజెక్ట్ కేవలం ప్రైవేట్ సంస్థల లాభాల కోసమే కాకుండా, రాష్ట్ర ఖజానాను సుసంపన్నం చేయడానికి ఒక ప్రధాన వనరుగా మారనుంది. నిబంధనల ప్రకారం వెలికితీసిన మొత్తం బంగారం విలువలో 4 శాతం రాయల్టీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి లభిస్తుంది.

అంచనాల ప్రకారం, తొలి ఏడాది ఉత్పత్తి చేసే 400 కిలోల బంగారంతో ప్రభుత్వానికి దాదాపు 57 కోట్ల రూపాయల ఆదాయం సమకూరనుంది. రాబోయే రోజుల్లో ఉత్పత్తి 900 కిలోలకు చేరినప్పుడు ఈ వార్షిక ఆదాయం 144 కోట్ల రూపాయలకు పెరగనుంది. భవిష్యత్తులో వార్షిక ఉత్పత్తి 2 టన్నుల మైలురాయిని చేరుకుంటే, ప్రభుత్వానికి వచ్చే రాబడి మరింత అద్భుతంగా ఉండి, ఆ నిధులను మళ్లీ సీమ అభివృద్ధి కొరకే వెచ్చించే అవకాశం కలుగుతుంది. బంగారం శుద్ధి ప్రక్రియలో నీటి అవసరాలు అత్యంత కీలకం. కరవు పీడిత ప్రాంతమైనప్పటికీ, స్థానిక తాగునీటి అవసరాలకు ఎలాంటి విఘాతం కలగకుండా యాజమాన్యం ముందుచూపుతో వ్యవహరించింది. హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు నుంచి లభించే మిగులు జలాల నుంచి 0.021 టీఎంసీల నీటిని, దాదాపు 18 కిలోమీటర్ల పొడవైన ప్రత్యేక పైపులైన్ ద్వారా ఈ ప్లాంట్ కు తరలించేందుకు పటిష్టమైన మౌలిక వసతులను కల్పించారు.

**స్వర్ణాంధ్రప్రదేశ్' మార్గంలో ఒక మైలురాయి**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షిస్తున్న 'స్వర్ణాంధ్రప్రదేశ్' స్వప్నానికి జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ ఒక ప్రత్యక్ష నిదర్శనం. రాయలసీమ లోని సహజ వనరులను శాస్త్రీయ పద్ధతిలో వాడుకుంటూ, పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించడానికి ఈ ప్రాజెక్ట్ ఒక రోల్ మోడల్ గా నిలవనుంది. జొన్నగిరి విజయవంతం అయితే.. రాబోయే రోజుల్లో చిత్తూరు, అనంతపురం జిల్లాలలో ఉన్న మరికొన్ని పసిడి నిక్షేపాల బ్లాకులను కూడా వేలం వేసి సరికొత్త పరిశ్రమలకు ఊతమిచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది. నేడు జొన్నగిరి గడ్డపై పడబోయే అడుగు.. రాయలసీమను కరవు నేల నుండి 'సిరిల నేల'గా, పసిడి కాంతుల వేదికగా మార్చే ఒక చారిత్రాత్మక సువర్ణ అధ్యాయం.

- మహా డెస్క్





## ఉప్పరిగూడ రైతు వేదికలో విత్తన మేళా..

- **విత్తన మేళాను ప్రారంభించిన పిఐసి చైర్మన్ పాండురంగారెడ్డి**
- **రైతులకు అందుబాటులో మాన్యమైన విత్తనాలు ఎరువులు**

**ఇబ్రహీంపట్నం జూన్ 23 మహా**: ఉప్పరిగూడ రైతు వేదికలో విత్తన మేళాను, పిఐసి చైర్మన్ పాండు రంగారెడ్డి ప్రారంభించినారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, పిఎసిఎస్ ఉప్పరిగూడ రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళాకు ముఖ్యఅతిథిగా హాజరైన పిఐసి చైర్మన్ ఏదుళ్ల పాండురంగారెడ్డి ప్రారంభించారు. అనంతరం రైతులకు కొనుగోలు చేసిన విత్తనాలను అందజేశారు. ఈ యొక్క విత్తన మేళాలో వరి సన్న స్వల్పకాలిక రకాలయినటువంటి RNR15048, తెలంగాణ సోనా, KNM1638, HMT సోనా, అదేవిధంగా జొన్న, పప్పు దినుసులు, కూరగాయల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు. నానో యూరియా, నానో డీఏపీ వంటి ఎరువులను ప్రోత్సహించే ఉద్దేశంతో రైతు వేదికలో ప్రదర్శించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పలు రకాల విత్తనాల పై రైతులకు అవగాహన కల్పించి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టిందని ఆయన అన్నారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలను రైతు వేదికలతో పాటు సొసైటీలో అందుబాటులో ఉన్నాయని, కాబట్టి రైతులందరూ వ్యవసాయ అధికారుల సలహా సూచనలు తీసుకొని మంచి దిగుబడి నిచ్చే రకాలను తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని రైతులను కోరారు. మీ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న రైతులు స్వల్పకాలీక రకం KNM1638, RNR 15048 వరి విత్తనాలు, నానో యూరియా, పచ్చ జొన్న (PSPY 2) విత్తనాలు, కూరగాయ విత్తనాలు కొనుగోలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సొసైటీ డైరెక్టర్లు, ఇంచార్జి ఏడిఏ విద్యాదారి, ఏఈఓ శ్రవణ్, సృజన, హార్టికల్చర్ అధికారి నవీన, హెచ్ఈఓ నగేష్, విత్తన డీలర్లు, రైతులు మెట్టు అశోక్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నడికుడి శ్రీనివాస్, పండల శేఖర్, దోకురి లింగారెడ్డి, వెంకటేష్, మోహన్ రెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.



## జల్సాలకు అలవాటై బైక్ దొంగగా మారిన యువకుడు

- **14 ద్విచక్ర వాహనాల స్వాధీనం.**

**కుషాయిగూడ, మహా**: మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలో బైక్ చోరీలకు పాల్పడుతున్న ఓ యువకుడిని కుషాయిగూడ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఉప్పల్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ తెలిపారు. ఇటీవల కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన బైక్ చోరీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వివరాలు వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం ప్యారారం గ్రామానికి చెందిన చిందం రాజు (27) పెయింటింగ్ పనులు చేస్తూ జల్సాలకు అలవాటుపడి బైక్ చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. విచారణలో నిందితుడు కుషాయిగూడ పరిధిలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను అపహరించినట్లు అంగీకరించాడన్నారు. నిందితుడి వద్ద నుంచి 14 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 2022లో ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోనూ అతనిపై చోరీ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ లక్షల్లో ఉంటుందని పేర్కొన్నారు. బైక్ చోరీల నియంత్రణ కోసం ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని, వాహన యజమానులు జీపీఎస్ పరికరాలు అమర్చుకోవడంతో పాటు భద్రతా చర్యలు పాటించాలని డీసీపీ సూచించారు.



## విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించండి...

**రాజేంద్రనగర్ మహా** : శంషాబాద్ జోన్ పరిధిలోని శంకరాపురం గ్రామస్థులు, విద్యార్థులు, చుట్టుముట్టు ఉండే గ్రామాల గ్రామస్తులు,విద్యార్థుల తో కలిసి మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి నివాసంలో అయినను కలిసి సమస్యలను వివరించారు. ఎన్నో సంవత్సరాలుగా శంకరాపురం గ్రామానికి బస్సు సౌకర్యం లేక స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాము. పాలమాకుల మోడల్ స్కూల్ కి పెద్ద గోల్కొండ, బహదూర్ గూడ, చిన్న గోల్కొండ, అమీదుల్లా నగర్, సంఘీ గుడా, శంకరాపురం, బురుజు గడ్డ తండా, షాపూర్ తండా నుంచి సుమారు తొమ్మిది గ్రామాలను నుండి పాలమాకుల మోడల్ స్కూల్ కి వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేదు. గ్రామాలనుంచి వెళ్తున్న వివిధ వాహనాలపై ట్రాక్టర్లను,డీసీఎంలలోవిద్యార్థులు వెళ్తున్నారు. పాఠశాల సమయానికి చేరుకోలేకపోతున్నామంటు విద్యార్థులతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో సార్లు అధికారులకు స్థానిక నాయకులకు ఫిర్యాదు చేసిన పట్టించుకునే పరిస్థితి లేదని వాపోయారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి పై నమ్మకంతో కలిసి వచ్చామన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఆర్టిసి ఉన్నతాధికారులతో మాట్లాడి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

## ఏబీవీపీ బంద్ విజయవంతం

**రాజేంద్రనగర్, మహా**: రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) చేపట్టిన పాఠశాలల బంద్‌కు మంగళవారం శంషాబాద్ శాఖ పరిధిలో విశేష స్పందన లభించింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు బంద్‌లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశాయి. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏబీవీపీ నగర కార్యదర్శి బత్తుల భరత్ తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావడం కోసం ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ పట్ల నిర్లక్ష్య ధోరణిని వీడి వెంటనే స్పందించి సమస్యల పరిష్కా



రానికి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పూర్తిగా పరిష్కరించే వరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర సంయుక్త కార్యదర్శి శ్యామ్ ప్రసాద్‌తో పాటు తిరుపతి, వేణు, వెంకట్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**నిర్మల్ మహా**: ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన సాగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతిగదిలోని విద్యార్థులతో కలెక్టర్ పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగారు. వారితో లెక్కలు చేయించారు. విద్యార్థులు పాఠాలను సులువుగా అర్థం చేసుకునే మెలుకువలు నేర్చుకోవాలన్నారు. సామాజిక అంశాల్లో భాగస్వామ్యం అవుతూ పలు విషయాల్లో అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు నేర్పిస్తున్న చదువు, అందిస్తున్న భోజనం సక్రమంగా ఉన్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు.అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, పిల్లలకు చదువుతో పాటు, నైపుణ్యాభివృద్ధి తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు వచ్చే సందేహాలు నివృత్తి చేస్తూ ఉండాలని తెలిపారు. ప్రతి రోజు అన్ని పూటల కామన్ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని చెప్పారు. విద్యార్థులకు వసతులు కల్పించడంలో



నిర్లక్ష్యం చేయరాదన్నారు.అనంతరం ఖానాపూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని చెప్పారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఏవైనా భూ సమస్యలు ఉన్నాయేమో అని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలలో డిఈఓ భోజన్న, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ప్రజారోగ్యాన్ని నాశనం చేస్తున్న డంపింగ్ యార్డ్ ను వెంటనే మూయించండి

- **హైదరాబాద్ ఘన వ్యర్థాలను సుదూర ప్రాంతాలకు తరలించండి.**
- **తక్షణమే హైదరాబాద్... పట్టణీకరణను రక్షించండి**
- **జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ**
- **బేగంపేట ప్రజా భవన్ లో వినతి పత్రం సమర్పణ.**

**కుషాయిగూడ, మహా**: పర్యావరణాన్ని ప్రజారోగ్యాన్ని నాశనం చేస్తున్న జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ను వెంటనే మూసి వేయించలని హైదరాబాద్ ఘన వ్యర్థాలను సుదూర ప్రాంతాలకు తరలించాలని తక్షణమే హైదరాబాద్ పట్టణీకరణ రక్షించండి అని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ ప్రజా భవన్ లో తెలంగాణ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా స్పందించిన చిన్నారెడ్డి వెంటనే మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి సమస్యలను సావధానంగా విన్న చిన్నారెడ్డి ఈ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ కన్వీనర్లు షేక్షావలి, ఉమా మహేష్ లు మీడియాతో మాట్లాడుతూ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని జవహర్ నగర్ పరిసర 12 గ్రామాల కాలనీల ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ 2001వ సంవత్సరంలో జవహర్ నగర్ లో ఏర్పాటు చేశారని మొదట్లో ఆల్వాల్ ఉప్పల్ కాప్రా మున్సిపాలిటీల వ్యర్థాలను సుమారు నాలుగేళ్ల పాటు పారబోయడానికి దాదాపు 330 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారని అయితే దాని నిర్దేశిత కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా దానిని మూసి వేయకుండా గత రెండున్నర దశాబ్దాలుగా హైదరాబాద్ నగరం మొత్తం మున్సిపల్ ఘన వ్యర్థాలను ఇక్కడే పారబోస్తున్నారని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ సభ్యులు శివ బాబు ఐఎఫ్టియు, మేకల కావ్య మాజీ మేయర్, మేక లలిత యాదవ్, ప్రఫుల్ రాంరెడ్డి, తోటపల్లి శంకర్ సిపిఐ, శివన్నారాయణ సిపిఎం, కొండలు ముదిరాజ్ బిఆర్ఎస్, రాజశేఖర్, స్వామి, అంజనేయులు, సుబ్రహ్మణ్యం, గొడుగు వేణు, అనురాధ, సదానందం, వై. మల్లేష్, ప్రవీణ్, జయక్క, పెరక సునీత, అనంతలక్ష్మి, కుమార్, సింగరాయ గౌడ్, దుర్గాప్రసాద్, ఆర్.నరసింహ గౌడ్, సదానందం, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికులందరికి ఇన్సూరెన్స్ చేయాలి

- **క్యాతనపల్లి మున్సిపల్ కమీషనర్ కు సీఐటీయు వినతి**

**మందమర్రి, మహా**: మున్సిపల్ కార్మికులందరికీ ఇన్సూరెన్స్ పాలసీ పథకాన్ని అమలు చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో క్యాతనపల్లి మున్సిపల్ కమీషనర్ కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. కార్మికులు పని చేస్తున్న అధికారులు ఇంకా పని చేయాలంటూ ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు అందరికి ఇన్సూరెన్స్ చేయించి, సబ్బులు, నూనె, చెప్పులు, బెల్లం ఇవ్వాలన్నారు. అలాగే అధికారులు కార్మికులపై పని ఒత్తిడిని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి సాంబార్ వెంకటస్వామి, మహేందర్, దేవవరం మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, రాజయ్య తిరుపతి, రమేష్, సుధాకర్,కుమార్, పోశం, మల్లేష్, శ్రీను, రామస్వామి, వి. కుమార్, రవి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు భూమిపూజ

అదిలాబాద్, మహా: అదిలాబాద్ పట్టణంలో రూ.10 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుషా, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి భూమిపూజ నిర్వహించారు. పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె తెలిపారు. త్వరలోనే రూ.100 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ సహకారంతో రూ.1.20 కోట్ల వ్యయంతో కల్వర్టులు, ప్యాచ్‌వర్క్




పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, అధికారులు, కౌన్సిలర్లు, స్థానికులు పాల్గొన్నారు.




## ఘనంగా డీసీసీ అధ్యక్షుడి బర్త్ డే

**ఆదిలాబాద్ మహా** : ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ పుట్టినరోజు వేడుకలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. మిఠాయిలు తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంతటి అభిమానాన్ని చూపిన కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు . శ్రేణుల ఆశీస్సులు ప్రేమే తనను ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా ముందుకు నడిపిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా , పట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## బాసర మహంకాళి ఆలయంలో చోరీ

**నిర్మల్ మహా** : నిర్మల్ జిల్లా బాసర శ్రీ సరస్వతీ అమ్మవారి ఆలయంలో చోరీ జరిగింది. పై అంతస్తులోని మహంకాళి ఆలయంలోని చొరబడిన దొంగలు అమ్మవారి వెండి కిరీటం, హుండీని ఎత్తుకెళ్లారు. మహంకాళి ఆలయ గేటు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. నగదు కాజేసి.. అనంతరం హుండీని వ్యాసగుడి దగ్గర పడేసి పరారయ్యారు. అర్చకులు మంగళవారం తెల్లవారుజామున పూజ కోసం వెళ్లి చూడగా చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిల పరిశీలించి, చోరీ జరిగిన పరిస్థితులు, సేకరించిన ప్రాథమిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల పరిశీలన తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఘటనకు సంబంధించిన ప్రతి కోణంలో దర్యాప్తు చేపట్టి, నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్ట్ చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఆలయ భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించిన ఎస్పీ భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘాను మరింత పటిష్టం చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని, త్వరలోనే నిందితులను పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.





## మహిళా సాధికారతకు ప్రాధాన్యత : కలెక్టర్

**ఆదిలాబాద్ మహా** : ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని మామిడిగూడ గ్రామంలో నూతనంగా విలేజ్ ఆర్గనైజేషన్ భవన నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, అందులో భాగంగానే గ్రామాల పరిధిలో అన్ని వసతులతో కూడిన సంఘ భవనాల నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. మామిడిగూడ గ్రామంలో నిర్మించనున్న ఈ వివో బిల్డింగ్ పనులను నిర్ణీత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల ప్రతినిధులు నిర్మాణ పనులను పర్యవేక్షించాలని సూచించారు. గ్రామీణ మహిళలు సంఘాల ద్వారా పొందుతున్న ప్రభుత్వ పథకాలను, రుణా అవసరాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల బలోపేతానికి, వారి ఆర్థిక స్వాలంబనకు ఈ వివో భవనాలు ఎంతగానో దోహదపడతాయని, మహిళలు ఒకే చోట సమావేశమై తమ సంఘాల పురోగతిపై చర్చించుకోవడానికి, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకోవడానికి ఈ భవనం ఒక వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్ పరిశీలించి, వైద్య సేవలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోవింద్, అధికారులు, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ భరోసా చెక్కు పంపిణీ

**బూర్గంపహాడ్, మహా:** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఫోటోగ్రాఫర్ భజన మల్లయ్య కుటుంబానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫోటో , వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.1.60 లక్షల కుటుంబ భరోసా చెక్కును మంగళవారం అందజేశారు. జిల్లా కన్వీనర్ పంపన రమేష్ చెక్కును అందజేసి, సభ్యుల కుటుంబాలకు సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కీసర సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పుట్టా మూర్తి, సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ చీరల పంపిణీ

**ప్రతి ఆడబిడ్డకు చీర అందిస్తాం: మహేందర్‌రెడ్డి**

**కుషాయిగూడ, మహా:** ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి ఆడబిడ్డకు ఇందిరమ్మ చీర అందజేస్తామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. కుషాయిగూడలోని లక్ష్మీ కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సోనియా గాంధీ స్ఫూర్తితో మహిళల సంక్షేమం కోసం ఇందిరమ్మ పేరుతో చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు గౌరవప్రదమైన స్థానం కల్పిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, మహాలక్ష్మి, గృహజ్యోతి, రూ.500 గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో మహిళలకు లబ్ధి చేకూరుతోందన్నారు. త్వరలో మహిళా సంఘాలకు పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసీ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పలు మున్సిపల్ కమిషనర్లు అధికారులు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, పలువురు నాయకులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. వందలాది మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు.



# నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి

- **పాలకుర్తి ఏఓ బండి ప్రమోద్ కుమార్**

**పాలకుర్తి, జూన్ 23** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని ఖరీఫ్ 2026 సీజన్‌ను పురస్కరించుకుని పాలకుర్తి రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'విత్తన మేళా'ను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ బండి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు వరితో పాటు ఇతర ఆరుతడి పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ కోసం ప్రత్యేకంగా ప్రకటించిన 7 రకాల వరి విత్తనాలు, సన్న వడ్ల రకాలను జిల్లాలోని అన్ని డీలర్ల వద్ద అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకునేందుకు వీలుగా ఈ మేళాలో పలు రకాల విత్తనాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు AEOs కే. శ్రీకాంత్, జే. సుష్మ, ఎం. సువర్ణరేఖలతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక రైతులు పాల్గొన్నా



# గాయపడిన కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దంపతులు

**రామగుండం, జూన్ 23** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం తక్కళ్లపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పొన్నం సాయితిరుమల్ గౌడ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ విషయాన్ని తెలుసుకున్న రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దంపతులు మంగళవారం ఆసుపత్రికి చేరుకున్నారు. చికిత్స పొందుతున్న సాయితిరుమల్ గౌడ్‌ను కలిసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం, బాధితుడికి అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులతో మాట్లాడి, వారికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. సాయితిరుమల్ గౌడ్ త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో క్రియాశీలకంగా పాల్గొనాలని ఎమ్మెల్యే దంపతులు ఆకాంక్షించారు.



# ప్రీ ప్రైమరీ పియం శ్రీ పథకాలను వెంటనే రద్దు చేయాలి..

**కారేపల్లి, మహా**:అంగన్వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ పాఠశాలలుగా మారుస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ, ఈ నిర్ణయాన్ని తక్షణమే రద్దుచేయాలని కోరుతూ అంగన్వాడీ టీచర్లు, మంగళవారం సింగరేణి మండలం పేరేపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అంగన్వాడీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, ఈ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రీప్రైమరీ, పీఎం శ్రీ పథకాల కింద ఏర్పాటు చేసిన 4,131 కేంద్రాల నిర్ణయాన్ని పున సమీక్షించి, అంగన్వాడీల ఆధ్వర్యంలో కొనసాగించాలని కోరారు. సమీకృత శిశు అభివృద్ధి సేవల (ఐసీడీఎస్) వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను అంగన్వాడీ సిబ్బందికే అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి, పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్స్ నాగరపు డేగమాంబ, పప్పుల విజయ, జే సీతమ్మ, ఎమ్ సుశీల, ఆయాలు కొప్పుల రాంబాయ్, చంద్రమ్మ, ఆశ వర్కర్లు బుచ్చమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల ముఠా అరెస్ట్

- **150 కిలోల బీజీ-2 విత్తనాల స్వాధీనం.. ఒకరు అరెస్ట్, మరొకరు పరారీ**

**యాదాద్రి భువనగిరి, జూన్ 23 (మహా)**: అంతర్‌రాష్ట్ర స్థాయిలో నకిలీ పత్తి విత్తనాల వ్యాపారం నిర్వహిస్తున్న ముఠాను యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి పోలీసులు ఛేదించారు. ఈ మేరకు 150 కిలోల నిషేధిత బీజీ2 పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని ఒక నిందితుడిని అరెస్ట్ చేసినట్లు యాదగిరిగుట్ట డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు మంగళవారం వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు తుర్కపల్లి బస్టాండ్ సమీపంలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి నిర్వహించిన తనిఖీల్లో దొండపాటి మల్లికార్జునరావును అదుపులోకి తీసుకున్నారు. అతడు గుంటూరు నుంచి సిద్దిపేటకు నిషేధిత బీజీ2 పత్తి విత్తనాలను అక్రమంగా తరలించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. విచారణలో చిత్తూరు జిల్లాకు చెందిన శంకర్‌తో కలిసి తెలంగాణలో నకిలీ పత్తి విత్తనాల కొనుగోలు, రవాణా, విక్రయాలకు కుట్ర పన్నినట్లు తేలింది. రైతులకు అధిక దిగుబడులు వస్తాయని తప్పుడు ప్రచారం చేస్తూ ఈ విత్తనాలను విక్రయించేందుకు ప్రయత్నించినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని డీఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి "బిల్లా బీజీ2 999" పేరుతో ఉన్న 70 కిలోల నకిలీ విత్తనాలతో పాటు మరో 80 కిలోల కల్తీ పత్తి విత్తనాలను స్వాధీనం



చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.1 లక్ష ఉంటుందని పేర్కొన్నారు. విత్తనాల నిల్వ, రవాణా, విక్రయాలకు సంబంధించిన ఎలాంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు, లైసెన్సులు లేదా బిల్లులు నిందితులు చూపించలేకపోయారని తెలిపారు. పరారీలో ఉన్న మరో నిందితుడు శంకర్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని చెప్పారు. నకిలీ విత్తనాల వల్ల పంట దిగుబడులు తగ్గి రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని, రైతులు ధృవీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలని అధికారులు సూచించారు. జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ పర్యవేక్షణలో అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, యాదగిరిగుట్ట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శంకర్, తుర్కపల్లి ఎస్ఐ మొహమ్మద్ తకియుద్దీన్, వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతో ఈ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

# అభివృద్ధిలో చెన్నూర్ నియోజకవర్గం దూసుకుపోతుంది

- **రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

**మంచిర్యాల, మహా**: మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గం అన్ని రంగాలలో దూసుకుపోతుందని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం కోటపల్లి మండలం లింగన్నపేట, ఏదుల బంధం, సిర్స, రొయ్యలపల్లి, ఆల్గాం, వెంచపల్లి గ్రామాలలో సి.సి. రోడ్లు, డ్రైనేజీల పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్ రెడ్డి లతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలలో సి.సి. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రతి గ్రామానికి 10 లక్షల చొప్పున కేటాయించి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. లింగన్నపేట గ్రామంలో గతంలో 14 నూతన విద్యుత్ పోల్స్, 4 బోర్ వెల్స్ పనులను దాదాపు 20 లక్షల రూపాయల ఈజీఎస్, ఎస్.డి.ఎఫ్. నిధులతో చేపట్టి ఇప్పుడు 10 లక్షలు కేటాయించడం జరిగిందని అన్నారు. ఏదుల బంధంలో 15 లక్షల రూపాయల ఎస్.డి.ఎఫ్., డి.ఎం.ఎఫ్.టి. నిధులతో పనులు చేపట్టడం జరిగిందని, ఆల్గాం, వెంచపల్లి, జనగాం గ్రామాలలో 10 లక్షల రూపాయల చొప్పున కేటాయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రేషన్ కార్డులు అందించి సన్నబియ్యం అందించడం జరుగుతుందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ వంటి అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగ అభి



వృద్ధిలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో 2 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయడం జరుగుతుందని, 200 కోట్ల రూపాయల వ్యయంతో సి.సి. రోడ్లు, మురుగునీటి వ్యవస్థ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 100 కోట్ల రూపాయల వ్యయంతో అమృత్ 2.0 పథకం ద్వారా ప్రజలకు త్రాగునీరు అందించేందుకు నీటి ట్యాంకులు, పైపులైన్ల ఏర్పాటు పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. 46 కోట్ల రూపాయల వ్యయంతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, వృత్తి విద్య కోర్సులు అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయడంతో పాటు విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెన్నూర్ లో నీటి వనరుల ఏర్పాటుకు 40 కోట్ల రూపాయలతో ప్రత్యామ్నాయ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్య రంగ బలోపేతం దిశగా కృషి చేస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, 23 మంది వైద్యులను నియమించి చెన్నూర్ లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని, మందమర్రి ప్రాంతంలో 50 పడకల ఆసుపత్రి పునః ప్రారంభానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. సింగరేణి సంస్థను లాభాల బాటలోకి తీసుకువచ్చి 11 వేల కోట్ల రూపాయల లాభాన్ని సాధించడం జరిగిందని తెలిపారు. ఇసుక మాఫియా నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని, సి.సి. కెమెరాలు, వే బ్రిడ్జిల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఆల్గాం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, మూత్రశాలలు, విద్యుత్, ఇతర మరమ్మత్తు పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో "సే నో టు డ్రగ్స్" కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి విక్రయాలపై పోలీసు శాఖ అధికారులు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడిలో సర్పంచ్ కూతురు

**కారేపల్లి, మహా:** ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంపొందించేలా కారేపల్లి మండలం విశ్వనాథపల్లి సర్పంచ్ ఇస్లావత్ రాజు తన కూతురు రవళిని ప్రైవేట్ స్కూల్ నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పించిన ఉపాధ్యాయుల కృషికి ఆకర్షితుడైన ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం విశ్వనాథపల్లి జెడ్పీ హైస్కూల్‌లో రవళిని చేర్పించగా, హెడ్‌మాస్టర్ పద్మ పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేసి సర్పంచ్‌ను అభినందించారు.

# క్రమశిక్షణకు నిదర్శనం త్రివేణి సంస్థలు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** క్రమశిక్షణకు నిదర్శనం త్రివేణి సంస్థలని రిటైర్డ్ లెక్చరర్ గొల్లపూడి ప్రకాష్ రావు అన్నారు. త్రివేణి పాఠశాలలో 33వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం గంగా క్యాంపస్ లో అత్యంత వైభవంగా నిర్వహించారు. 33 సంవత్సరాలు విజయవంతమైన విద్యా ప్రస్థానాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ వేడుకలు ఆనందోత్సాహాల నడుమ సాగాయి.అనంతరం 33 వసంతాల సంచికను ఆవిష్కరించి సభలోని అతిథులకు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు రిటైర్డ్ డిగ్రీ కాలేజి జేకేసి కాలేజ్ లెక్చరర్ గొల్లపూడి ప్రకాశరావు పాల్గొని మాట్లాడారు.

త్రివేణి సంస్థల ప్రస్థానాన్ని కవిత రూపంలో అద్భుతంగా ఆవిష్కరించారని పేర్కొన్నారు. త్రివేణి సంస్థలు మానవత్వం క్రమశిక్షణ విలువలు అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తున్నాయని అలాంటి గొప్ప లక్షణాలను ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. త్రివేణి సంస్థల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ మాట్లడుతూ విద్యార్థులు ప్రతి విద్యార్థులతో ప్రేమాభిమానాలు స్నేహభావంతో మెలగాలని ఉపాధ్యాయుల పట్ల గౌరవం తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత సమాజం పట్ల బాధ్యతతో కూడిన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. డైరెక్టర్ మాచవరపు కోటేశ్వరరావు మాట్లాడుతూ బాల్యం యవ్వనం దశలో వ్యక్తి జీవితంలో చోటుచేసుకునే మార్పులు బాధ్యతలు అవకాశాలు సవాళ్ల గురించి వి



వరించారు. ప్రతి దశలో మంచి విలువలు క్రమశిక్షణ లక్ష్యసాధనతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు గీతాలు ప్రసంగాలు కవితా పఠనం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిని డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, సీ.ఆర్.ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపల్స్ శ్రీనివాస్ సింగ్, సూర్యనారాయణ మూర్తి, నేతజీ, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య పాల్గొని త్రివేణి కుటుంబ సభ్యులకు ఆవిర్భావ దినోత్స శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యారంగంలో నాణ్యమైన విద్యను అందిస్తూ ముందుకు సాగుతున్న త్రివేణి స్కూల్స్ మరెన్నో విజయాలను అందుకోవాలని అందరూ అభిలషించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పూర్వ విద్యార్థులు అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# విద్యుద్ఘాతంతో పాడిగేదె మృతి

**కారేపల్లి, మహా :**విద్యుద్ఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం గేటుకారేపల్లి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. మేకలతండా గ్రామానికి చెందిన గుగులోత్ రవీందర్ కు చెందిన పాడి గేదె సోమవారం మేతకు గేటుకారేపల్లి హైస్కూల్ సమీపంలోని పోలాల వద్దకు వచ్చింది. ఆ ప్రాంతంలో బావులకు విద్యుత్ సరఫరా చేసే కరెంటు తీగలు క్రిందను వేలాడుతున్నాయి. అక్కడికి మేతకు వచ్చిన గేదెకు తీగలు తగలి విద్యుద్ఘాతానికి గురై అక్కడి కక్కడే మృతి చెందింది. ఈ విషయమై విద్యుత్ అధికారులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు. తమకు జీవనాధారమై పాడి గేదె మృతి చెందిందని తమను ఆదుకోవాలని బాధితుడు అధికారులను వేడుకుంటున్నాడు.



# ఆలేరు వాగు పై బ్రిడ్జిని వెడల్పు చేయాలి

- **ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బ్రిడ్జిని వెడల్పు చేయరా?**
- **అఖిలపక్షం డిమాండ్**

**యాదాద్రి భువనగిరి జూన్ 23 మహా** :యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని పెద్దవాగుపై ఉన్న బ్రిడ్జి పై నుండి ప్రతిరోజు జనగాం వరంగల్, గుండ్లగూడెం,పటేల్ గూడెం, మరియు జీడికల్ పరిసర గ్రామాలకు వందలాది మంది ప్రజలు నడుచుకుంటూ,ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేస్తున్నారు... అలాగే ఆలేరు పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ మరియు వ్యవసాయ మార్కెట్ మరియు ఎంపీడీవో కార్యాలయంకు ప్రతినిత్యం ఆలేరు ప్రజలు ఈ బ్రిడ్జి పై నుండి వెళ్లి వస్తుంటారని అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసునూరి వీరేశం వివరించారు కానీ ఈ బ్రిడ్జి ఇరుకుగా ఉండటం వలన గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగి చాలామంది మరణించారని ఎంతోమంది గాయాల పాలైనారని కానీ ఇంతవరకు ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, ఎంపీలు మంత్రులు ప్రభుత్వ అధికారులు ఈ బ్రిడ్జి పై నుండి పలుమార్లు ప్రయాణం చేస్తున్నారు కానీ వీరికి ఈ ఇరుకుగా ఉన్న బ్రిడ్జి కనిపించుట లేదా అని ప్రశ్నించారు ప్రజా ప్రతినిధులకు అధికారులకు ఈ విషయంలో బాధ్యత లేదా వెంటనే ఆలేరు ఎమ్మెల్యే మరియు సంబంధిత అధికారులు స్పందించి ఈ వాగు పై ఉన్న బ్రిడ్జిని వెడల్పుగా నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలని అఖిలపక్ష కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం డిమాండ్ చేశారు లేని పక్షంలో అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

# ఎస్ఐఆర్ పై అవగాహన సదస్సు

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాజేంద్రనగర్ నియోజకవర్గంలో స్థాయి అవగాహన శిక్షణ శిబిరాన్ని మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో దుర్గా కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు.ఎస్ఐ ఆర్ శిక్షణ కార్యక్రమం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పర్యవేక్షణలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఎస్ ఐ ఆర్ పై ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి,విజయ డైరీ చైర్మన్ అమిత్ రెడ్డిబి ఎల్ ఏ లకు అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై ఏజెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి రాబోయే రోజుల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి




చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణా శిబిరంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, వివిధ విభాగాల నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు( బి ఎల్ ఏ లు) తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ డ్యూటీ మీట్

**ఆదిలాబాద్ మహా:** రాష్ట్రంలో నిర్వహిస్తున్న పోలీసు డ్యూటీ మీట్ లో భాగంగా జిల్లా స్థాయి డ్యూటీ మీట్‌ను ఆదిలాబాద్ జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పోలీసు అధికారులు, సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించేందుకు డ్యూటీ మీట్ లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జోనల్, రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.ఈ డ్యూటీ మీట్ లో ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ లాస్, మెడికో లీగల్ టెస్ట్, ఫింగర్ ప్రింట్ సైన్స్, లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎగ్జిబిట్స్, క్రైమ్ సీన్ ఫోటోగ్రఫీ, పోలీస్ పోర్ట్రెయిట్, అబ్జర్వేషన్ టెస్ట్ , యాంటీ సబటేజ్ చెక్, డాగ్ స్క్వాడ్ కాంపిటిషన్, కంప్యూటర్ అవేర్‌నెస్ కాంపిటిషన్ వంటి అంశాలలో పరీక్షలు, పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేర స్థల పరిశోధన, శాస్త్రీయ ఆధారాల సేకరణ, ఫింగర్ ప్రింట్ల గుర్తింపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, వీడియో, ఫోటో ఆధారాల విశ్లేషణ, బాంబు గుర్తింపు ,భద్రతా తనిఖీలు వంటి అంశాలపై సిబ్బందికి ప్రాక్టికల్ , రాత పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు ప్రస్తుత కాలంలో నేరస్థులు ఉపయోగిస్తున్న కొత్త పద్ధతులను తెలుసుకొని, నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకొని, తమ విధుల్లో మరింత సమర్థవంతంగా పనిచేసేలా ఈ డ్యూటీ మీట్ లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ట్రైనింగ్‌లో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో అమలు చేసే విధంగా అనుభవాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్వయంగా ఫింగర్ ప్రింట్లు తీసే విధానాన్ని ప్రదర్శించి సిబ్బందికి శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు పి. మౌనిక ఐపీఎస్, బి. సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్. జీవన్ రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్, ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, ఫింగర్ ప్రింట్, ఎన్ఐబి, డీసీ ఆర్‌బీ, బీడీ టీం, డాగ్ స్క్వాడ్, రిజర్వ్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నూతన వేతనాలు వెంటనే అమలు చేయాలి: యారం పిచ్చిరెడ్డి

**బూర్గంపహాడ్, మహా :**తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన నూతన కనీస వేతనాలను ఐటీసీ కర్మాగారంలో తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర కనీస వేతన మండలి సభ్యుడు, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఐటీసీ యాజమాన్యానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం విడుదల చేసిన G.O.Ms. No.6 (30052026) ప్రకారం నూతన కనీస వేతనాలు 01062026 నుంచి అమల్లోకి వచ్చాయని తెలిపారు. పాత వేతన నోటిఫికేషన్లు రద్దైన నేపథ్యంలో, ఐటీసీపీఎస్‌పీడీ భద్రాచలం యూనిట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కొత్త వేతనాలు వెంటనే వర్తింపజేయాలని కోరారు. అలాగే కార్మికులకు న్యాయమైన వేతనాలతో పాటు చట్టబద్ధమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఐటీసీ విభాగం అధ్యక్షుడు గోనే రామారావు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

# మూతపడిన బడి మళ్లీ ప్రారంభం

**కారేపల్లి, మహా:** విద్యార్థుల కొరతతో 2022లో మూతపడిన ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గంగారం తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గురువారం నుంచి తిరిగి ప్రారంభం కానుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ భూక్యా కిరణ్ తల్లిదండ్రులను చైతన్యపరచి విద్యార్థులను పాఠశాలకు రప్పించేందుకు కృషి చేశారు. దీంతో పాఠశాల పునఃప్రారంభానికి ఎంఈఓ జయరాజ్ ముహూర్తం ఖరారు చేశారు. పాఠశాల ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు.



## జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలి

- యాదాద్రి భువనగిరి జిల్లా

**జూన్ 23 మహా** : యాదాద్రి భువనగిరి : జిల్లాలోని వివిధ మండలాలో నెలకొన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుల జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు మహమ్మద్ షానూర్ బాబా ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం భువనగిరి పట్టణంలో వందన కాన్ఫరెన్స్ హల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో షానుర్ బాబా పాల్గొని మాట్లాడుతూ ఈ ప్రభుత్వమైనా జర్నలిస్టుల ఇండ్ల సమస్యలను పరిష్కరించి ఇడ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.జర్నలిస్టులకు సొంత ఇండ్లు లేక అద్దె ఇండల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ గృహ పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టి జె ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా కార్యదర్శి నాగరాజు,కదిర్, భువనగిరి మండల కార్యదర్శి అల్తాఫ్,గుండాల అధ్యక్షులు నరేష్, మోత్కూర్ అధ్యక్షులు నర్సింహా, అడ్డగూడూర్ అధ్యక్షులు సందీప్, తుర్కపల్లి కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.



## ఘనంగా సీడ్ మేళా ప్రారంభం

- హాజరైన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్
- ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి
- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి

**మహా వరంగల్ బ్యూరో**: ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని గురిజాల రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన సీడ్ మేళా కార్యక్రమాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ డిమాండ్ కలిగి ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి విత్తన రకాలకు మాత్రమే బోనస్ ఇవ్వడం జరుగుతుందని, వాటిని మాత్రమే ఈ సీడ్ మేళాలో అధీకృత డీలర్ల ద్వారాబ అమ్మకాలకు పెట్టడం జరిగిందని తెలిపారు. పంటల ఎంపికలో వర్షపాత పరిస్థితులను పరిగణలోకి తీసుకొని మధ్య కాలిక స్వల్పకాలిక రకాలను పెంచుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. వర్షాభావ పరిస్థితులు నెల కొంటే పప్పు ధాన్యాలు, జొన్న, నువ్వులు, కూరగాయలు సాగుకు వంటి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. యూరియాను సిఫార్సు చేసిన మోతాదు లోనే వినియోగించాలని, రెండో దఫా నుంచి నానో యూరియాను తప్పనిసరిగా ఉపయోగించాలని రైతులను కోరారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని తెలిపారు. రైతులు అంతర పంటలు సాగు చేయడంతో పాటు తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను ఎంచుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించు కోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు ఒకే చోట అన్ని విత్తనాలు అందుబాటులో ఉంచడంలో హర్షం వ్యక్తం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలై శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయ నిర్మల, డీహెచ్‌వో శ్రీనివాస్, ఏడీఏ శ్రీనివాస్, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, వ్యవసాయ అధికారి కృష్ణకుమార్, సర్పంచ్‌లు గురిజాల చంద్రరావు, చిన్న గురిజాల కమలాకర్, జీజీఆర్‌పల్లి బుస నర్సయ్య, గుంటూరు పల్లి రజిత, వ్యవసాయ విస్తరణాధికారులు అశోక్, సింధు, సంధ్య, త్రివేణి, అబిద్ హుస్సేన్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## యశోద హాస్పిటల్ లో న్యూరోసర్జరీ, స్పైన్ కేర్ సేవలు

- మలక్ పేట్, యశోదా ఆసుపత్రిలో శస్త్రచికిత్స విజయవంతం
- ఇబ్బంది లేకుండా, పూర్తి స్వతంత్రంగా మళ్లీ నడవగలుగుతున్న రోగి
- మలక్పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం

**ఇబ్రహీంపట్నం జూన్ 23 మహా**:మలక్ పేట్, యశోదా ఆసుపత్రిలో క్లిష్టమైన మల్టీలెవల్ స్పైన్ డీకంప్రెషన్ మరియు స్టెబిలైజేషన్ శస్త్రచికిత్స విజయవంతం కావడం జరిగిందని, మంగళవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోద సంస్థ డాక్టర్లు తెలిపారు. రోగులకు అందుబాటులో ఉన్న అత్యాధునిక న్యూరోసర్జరీ, స్పైన్ కేర్ సేవలకు నిదర్శనమని, యశోద ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది. హైదరాబాద్ కు చెందిన 53 ఏళ్ల ఏలేటి విమల గత కొంతకాలంగా తీవ్రమైన నడుము నొప్పితో పాటు కుడి కాలికి వ్యాపించే నొప్పి, రెండు కాళ్లలో తిమ్మిర్లు, మొద్దుబారడం వంటి సమస్యలతో ఆమె బాధపడుతున్న క్లిష్ట పరిస్థితిలో హైదరాబాద్ మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో విజయవంతంగా అత్యాధునిక వెన్నెముక శస్త్రచికిత్స నిర్వహించారు. వెన్నెముకను స్థిరపరిచే ఈ అత్యాధునిక చికిత్స తర్వాత సదరు రోగి ఎటువంటి ఇబ్బంది లేకుండా, పూర్తి స్వతంత్రంగా మళ్లీ నడవగలుగుతున్నారు. కాలం చెల్లిన నమ్మకాలను పక్కనబెట్టి, సకాలంలో సరైన వైద్య నిర్ణయం తీసుకుంటే వెన్నెముక సమస్యల నుంచి సంపూర్ణ విముక్తి సాధ్యమని ఈ విజయగాధ నిరూపిస్తోంది." ఈ సందర్భంగా యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ... బహుళ స్థాయిల్లో వెన్నెముక సమస్యలతో బాధపడుతున్న రోగులకు అత్యున్నత స్థాయి శస్త్రచికిత్స నైపుణ్యం, ఆధునిక ఇమేజింగ్ సదుపాయాలు, ప్రత్యేక పునరావాస సేవలు అవసరమని తెలిపారు. యశోద హాస్పిటల్ లో అత్యాధునిక న్యూరోసర్జరీ ఆపరేషన్ థియేటర్లు, న్యూరో మానిటరింగ్ వ్యవస్థలు, ఐసీయూ సదుపాయాలు, అనుభవజ్ఞులైన న్యూరో సర్జన్లు, పునరావాస నిపుణుల సమన్వయంతో క్లిష్టమైన వెన్నెముక వ్యాధులకు కూడా విజయవంతంగా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. రోగుల నొప్పిని తగ్గించి, తిరిగి సాధారణ జీవితానికి చేరువ చేయడమే తమ లక్ష్యమని వారు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకోసం, ఎ. వాసుకిరణ్ రెడ్డి - 97057 71230 / 99499 98378 నెంబర్లను సంప్రదించగలరు.




## నాణ్యమైన విద్య మెరుగైన వసతులు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి భువనగిరి జూన్ 23 మహా** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అధికారులను అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్....పాఠశాలలో కొత్తగా ఎన్ని అడ్మిషన్లు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మొత్తం ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు, ప్రతిరోజు విద్యార్థుల హాజరు శాతం ఎంత ఉందని సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరూ పాఠశాలకు హాజరయ్యారా, ఎంత మంది గైర్హాజరులో ఉన్నారో వివరాలు తెలుసుకున్నారు. గైర్హాజరైన విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, వారి ఇళ్లకు ఫోన్ చేసి తల్లిదండ్రులతో మాట్లాడి వెంటనే పాఠశాలకు రప్పించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళికలు రూపొందించాలన్నారు. అనంతరం పాఠశాలలో నూతనంగా నిర్మాణంలో ఉన్న తరగతి గదులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తరగతి గదుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. తదుపరి మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, రోజు అందిస్తున్న భోజనం మెనూ ప్రకారం ఉందా లేదా అని తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించడంలో ఎలాంటి లోపాలు ఉండకూడదని సూచించారు. కిచెన్ మరియు స్టోర్ రూమ్‌ను కూడా పరిశీలించి, ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి తెలిపారు. పరిశుభ్రత, ఆహార నాణ్యత విషయంలో రాజీ పడకుండా పని చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు

### ప్రజలకు మరింత చేరువ కావడం కోసమే

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక



**యాదాద్రి భువనగిరి జూన్ 23 మహా** : జిల్లాలో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా 99 రోజుల పాటు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని స్పెషల్ సి. యస్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ప్రత్యేక అధికారి శ్రీ బెనహర్ మహేష్ దత్ ఎక్కా తెలిపారు. బుధవారం జిల్లా యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ మినీ మీటింగ్ హల్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి జిల్లాలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల పై వివరాలను పొందుపరుస్తూ అన్ని శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఫైల్ క్లియరెన్స్, పారిశుధ్యం, వైద్య ఆరోగ్య సేవలు,అరైవ్ అలెవ్, వ్యవసాయం, విద్యా,సంక్షేమ, మహిళా వారోత్సవాలు, యువజన మరియు క్రీడా శాఖ,పశు సంవర్ధక శాఖ, అటవీ శాఖ, మత్య,కార్యక్రమాల వివరించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో, వార్డులు, మున్సిపల్ పట్టణాల వారీగా నిర్వహించిన గ్రామ సభలు, ఇతర కార్యక్రమాల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి బెన్హర్ మహేష్ దత్ ఎక్కా మాట్లాడుతూ 99 రోజుల కార్యచరణ ప్రణాళిక అనేది ప్రారంభం మాత్రమే, ముగింపు కాదని అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో గ్రామాలలో, వార్డులలో వచ్చిన అన్ని ఫిర్యాదులను, సమస్యలను పరిశీలించుటకు తదుపరి కార్యాచరణ వెంటనే ప్రారంభించాలని, ముఖ్యంగా పోలీస్ శాఖ వారు ప్రమాదాల నివారణకు, డ్రగ్స్ రహిత సమాజం కొరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వైద్య ఆరోగ్యశాఖ ప్రజల ఆరోగ్యం కొరకు, బాలికల ఆరోగ్యం కొరకు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఎఫ్ ఆర్ ఎస్ ద్వారా విద్యార్థులు మరియు ఉద్యోగుల హాజరు నమోదు చేయాలని తెలియజేయడం జరిగింది. జిల్లాలో యువజన మరియు క్రీడల సంబంధించి ప్రతి క్రీడా ప్రాంగణంకు ఒక కోచ్ ను కేటాయించి కోచ్ ద్వారా క్రీడాకారులకు సూచనలు సలహాలు ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలి.టూరిస్ట్ ప్రదేశాలలో ప్రజల అవసరాలకు సంబంధించి వసతులు మరియు టాయిలెట్ సదుపాయాలు కల్పించాలి.సంప్రదాయ కళాజాతల ద్వారా ఆ ప్రదేశాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలి.అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ విద్యుత్తు సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ సంక్షేమానికి సంబంధించిన లబ్ధిదారుల వివరాలతో కూడిన డాష్ బోర్డులను ఏర్పాటు చేయాలని తెలియజేశారు. వ్యవసాయ శాఖలో వస్తున్న నూతన వ్యవసాయ విధానాలను,సంప్రదాయ సేంద్రియ ఎరువుల వాడకం పెంపొందించే విధంగా రైతులకు సూచనలు ఇవ్వాలని కోరారు. సంక్షేమ హాస్టల్లో మొబైల్ యాప్ ఫీల్డ్ ఇన్స్పెక్షన్ ద్వారా హాస్టల్లో పని తీరుపై సమగ్రమైన నివేదికలను ఎప్పటికప్పుడు ఇవ్వాలని తెలియజేశారు.మహిళా సంక్షేమానికి సంబంధించి బ్యాంకు రుణాలు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలియజేశారు. ప్రతి నెల ఇలాంటి సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేయాలి

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల..**

రాజేంద్రనగర్ మహా; దేశ ఐక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన భరతమాత ముద్దుబిడ్డ జన్ సంగ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శ్రీరాంనగర్ లో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి బిజెపి నాయకులతో కలిసి డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులతో కలిసి మొక్కలు నాటారు. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ని ఆదర్శంగా తీసుకోవాలి. మనమందరం ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, సూర్ రెడ్డి వినయ్ రెడ్డి,జోగు రవి, అడికే జనార్ధన్, శ్రీకాంత్ రెడ్డి, సంతోష్ గౌడ్,తలారి చిన్న, ఎల్ వి రెడ్డి, పాత్లవత్ రామారావు, ఆదిముల చంద్రశేఖర్, మాజర్ భాయ్, మహేశ్వరెడ్డి, బాలు, రాంబాబు వెంకట్ రమణ, సత్యనారాయణ శివా రెడ్డి, ఓం భాను ప్రకాష్ దత్తాత్రేయ, కళ్యాణ్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.




## ఓపెన్ డిగ్రీ'లో ప్రవేశాలకు ఆహ్వానం

**బెల్లంపల్లి, మహా:**బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్లో డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. ఏకాంబరం తెలిపారు. బిఎ, బీకాం, బీఎస్సీ కోర్సులలో నచ్చిన సబ్జెక్టులను ఎంచుకొని దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందుకుగాను ఆగస్టు 7వ తేదీ వరకు అవకాశం ఉందని వివరించారు. ప్రతీ సంవత్సరం బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ద్వారా వందల మంది విద్యార్థులకు డిగ్రీ దూరవిద్యను అందిస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్సైట్లో గాని, బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్లో గానీ సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

## ఎస్ఐఆర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- అర్హులైన వారు ఓటరు జాబితాలో నమోదు కావాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావాలి



**మహా వరంగల్ బ్యూరో**: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అలాగే అర్హులైన వారు ఓటరు జాబితాలో నమోదు కావాలని వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితాను లోపరహితంగా, సమగ్రంగా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని, జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని అన్నారు. జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు నోటీసుల జారీ, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిశీలన, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని, అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వివరించారు. వరంగల్ జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 799 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమ నిర్వహణలో బీఎల్వోలతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బీఎల్ఏలు కూడా సమన్వయంతో పనిచేస్తారని చెప్పారు. ఓటరు జాబితాను సమగ్రంగా పరిశీలించి అర్హులైన ప్రతి పౌరుడి పేరును నమోదు చేయడం, అనర్హుల పేర్లను తొలగించడం, అవసరమైన సవరణలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరించడం, కొత్తగా అర్హులైన ఓటర్లను గుర్తించడం, మరణించిన లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారి వివరాలు నమోదు చేయడం జరుగుతుంది. ప్రస్తుతం ఓటర్లను వెరిఫై చేయడం జరుగుతుంది. దీని కోసం ప్రతి ఇంటికి ముందుగా ముద్రించిన ఎన్యుమరేషన్ ఫారాలను రెండు ప్రతులుగా అందజేసి, వాటిని ఎలా పూరించాలో మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదైన ద్వంద్వ ఓటర్లను గుర్తించి, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బిఎల్వోలు ప్రతి ఇంటిని సందర్శించారు. ఇలా సందర్శించే సందర్భాలలో ఇంటికి తాళం వేసి ఉన్న సందర్భాల్లో అట్టి ఇంటిని మూడు సార్లు సందర్శిస్తారు.. ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతానికి ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులు సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బి. సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జిల్లా పౌర సంబంధాల అధికారి బి. ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## ఈసీ వాగును దాటే ప్రయత్నం చేయవద్దు

**ఈసీ వాగుకును సందర్శించిన. ఫ్యూచర్ సిటీ కమిషనర్**

తరుణ్ జోషి.. రాజేంద్రనగర్ మహా; సోమవారం రాత్రి కురిసిన వర్షానికి సుల్తాన్ పల్లి గ్రామ పరిధిలోని ఈసీ వాగు ఉదృతంగా ప్రవహిస్తుంది. సుల్తాన్ పల్లి నుండి మొయినాబాద్ కు వెళ్లి రోడ్డు మార్గం మొత్తం నీటిలో మునిగిపోయింది. గ్రామ సర్పంచ్ ప్రభాకర్ గౌడ్, ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి, చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతమ్, శంషాబాద్ సిఐ నరేందర్ రెడ్డి, సయ్యద్ సాదాద్ అలీ తో కలిసి మంగళవారం సుల్తాన్ పల్లి లోని ఈసీ వాగును సందర్శించారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్ మాట్లాడుతూ ఈసీ వాగు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు వాహనదారులు ఈసీ వాగు దాటి ప్రయత్నం చేయవద్దన్నారు.



కరెంటు పోల్స్ జోలికి వెళ్ళొద్దన్నారు. వాగును చూసేందుకు,సెల్ఫీలు లేదా ఫోటోలు దిగేందుకు వాగులోకి వెళ్లకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. వరద నీటి ప్రవాహం వైపు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే డయల్ 112 కి కాల్ చేయాలని సూచించారు.

## జూన్ 25 నుంచి హౌస్‌టుహౌస్ సర్...

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మొదటి దశ అత్యంత కీలకం...
ఓటర్లు వద్దకు చేరుకొని వివరాలు సక్రమంగా నమోదు చేయాలి
సంబంధిత అధికారులకు ఆదేశాలు జారి
జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)2026లో మొదటి దశ అత్యంత కీలకం అని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)2026 కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)2026 కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించే హౌస్‌టుహౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియ అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారమ్‌ల ముద్రణ, పంపిణీ, శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయని, అన్ని మండలాలకు అవసరమైన ఫారమ్‌లు, ఓటరు జాబితాలు అందజేయడం జరిగిందని తెలిపారు. బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లు, పీఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలకు అవసరమైన శిక్షణ పూర్తి చేసినట్లు చెప్పారు. జూన్ 25 నుంచి ప్రారంభమయ్యే హౌస్‌టుహౌస్ కార్యక్రమంలో ప్రతి ఓటరికి తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారమ్ అందజేయాలని, ఇంట్లో లేని సందర్భాల్లో కనీసం మూడు సార్లు సందర్శించి ఫారమ్ అందించే ప్రయత్నం చేయాలని ఆదేశించారు. ఫారమ్ అందించినట్లు రసీదు లేదా తగిన ఆధారాలు ఉండాలని పేర్కొన్నారు. 2002 ఓటరు జాబితాలో పేరు ఉన్న అర్హులైన ఓటర్లకు ఈ దశలో ఎటువంటి సహాయక పత్రాలు (Supporting Documents) అడగాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాను 2002 జాబితాతో మ్యాపింగ్ చేసి, వివరాలను ధృవీకరించి సంతకం తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. ఓటర్లకు సంబంధించిన వివరాలు CEO Telangana, ECI మరియు Voters eci.gov.in వెబ్‌సైట్‌లలో సులభంగా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జూలై 31న ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఎన్యుమరేషన్ ఫారమ్‌లు సమర్పించిన వారి పేర్లు మాత్రమే ఉంటాయని, ఫారమ్‌లు సమర్పించని వారి పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో కనిపించకపోవచ్చని వివరించారు. అందువల్ల ఫారమ్ పంపిణీ, సరైన వివరాలతో నింపించడం, తిరిగి సేకరించడం అనే మూడు దశలను అత్యంత జాగ్రత్తగా పూర్తి చేయాలని సూచించారు.
అర్బన్ ప్రాంతాల్లో షిఫ్టెడ్ ఓటర్లు, అద్దెకు నివసిస్తున్న వ్యక్తులు, కొత్తగా వచ్చిన నివాసితుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని, వారు ఇతర నియోజకవర్గాల్లో ఓటర్లుగా ఉంటే ఫారమ్ 8 ద్వారా బదిలీ (Transfer) చేయించే చర్యలు చేపట్టాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడైన వ్యక్తికి ఫారమ్ 6 అందించి కొత్తగా ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎవరైనా ఓటరు నివాసం మార్చినట్లు, మరణించినట్లు లేదా అక్కడ నివసించడం లేదని పేర్కొంటే దానికి తగిన ఆధారాలు, స్థానికుల స్టేట్‌మెంట్లు నమోదు చేయాలని సూచించారు. ఆధారాలు లేకుండా ఏ పేరును తొలగించరాదని స్పష్టం చేశారు. SIR కార్యక్రమంలో పనిచేస్తున్న బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలు తదితర అధికారులు రాబోయే మూడు నెలల పాటు ప్రధానంగా ఈ కార్యక్రమంపైనే దృష్టి సారించాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం మరియు భారత ఎన్నికల సంఘం కూడా ఇదే మేరకు ఆదేశాలు జారీ చేశాయని తెలిపారు.

ఈ SIR కార్యక్రమం విజయవంతం కావడానికి ఎన్నికల అధికారులు, బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరస్పర సమన్వయంతో పని చేయాలని, ప్రతి అర్హత కలిగిన ఓటర్లు వద్దకు చేరుకొని వారి వివరాలు సక్రమంగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత్ రెడ్డి, వికాస్ మహతో, ఐఏఎస్, జోనల్ కమిషనర్లు, ఈఆర్వో ఆర్డీవోలు, రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.






తండ్రయిన టాలీవుడ్ హీరో..

# తల్లిబిడ్డ క్షేమం


తెలుగు హీరో నారా రోహిత్ తండ్రి అయ్యాడు. ఇతడి భార్య శిరీష.. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ప్రస్తుతం తల్లిబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని పేర్కొన్నారు. 'బాణం' సినిమాతో హీరోగా పరిచయమైన నారా రోహిత్.. తర్వాత అడపాదడపా సినిమాలు చేస్తూనే ఉన్నారు. మధ్యలో కొన్నాళ్ల పాటు మూవీస్ పక్కనబెట్టేశాడు. రీసెంట్ టైంలో భైరవం, సుందరకాండ తదితర మూవీస్ చేశాడు. ఇకపోతే తనతో పాటు 'ప్రతినిధి 2' చిత్రంలో హీరోయిన్ గా చేసిన శిరీషని ప్రేమించిన రోహిత్.. గతేడాది అక్టోబరులో ఆమెని వివాహం చేసుకున్నాడు. ఇప్పుడు వీళ్లకు మగబిడ్డ పుట్టాడు.

# రూ. 50 కోట్ల క్లబ్బులోకి మా ఇంటి బంగారం



బాక్సాఫీస్ వద్ద 'మా ఇంటి బంగారం' రికార్డులు సృష్టిస్తోంది. దాదాపు మూడేళ్ల గ్యాప్ తర్వాత సమంత నటించిన చిత్రమిది. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సమంత భర్త రాజ్ నిడిమోరు కథ, కథనం అందించడంతో పాటు నిర్మాతగానూ వ్యవహరించాడు. భారీ అంచనాలతో ఈ నెల 19న విడుదలైన ఈ మూవీ తొలి రోజు మిక్స్‌డ్ టాక్ సంపాదించుకుంది. రెండో రోజు నుంచి నెమ్మదిగా పుంజుకొని వీకెండ్‌లో భారీ కలెక్షన్స్ రాబట్టింది. ఫ్యామిలీ ఆడియన్స్, ముఖ్యంగా మహిళలు ఈ చిత్రంపై ఆసక్తిని కనబరుస్తున్నారు. తొలి రోజు ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ. 13 కోట్లకు పైగా వసూలు చేసింది. ఇక కేవలం నాలుగు రోజుల్లోనే హాఫ్ సెంచరీ(రూ.50 కోట్లు) కొట్టి రికార్డు క్రియేట్ చేసింది. నాలుగు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా రూ. 50 కోట్ల వసూలు వచ్చినట్లు మేకర్స్ ప్రకటించారు. ఇక ఈ చిత్రానికి రూ. 30 కోట్ల బడ్జెట్ అయినట్లు సమాచారం. ఇప్పటికే ఓటీటీ, శాటిలైట్స్, ఆడియో రైట్స్ రూపంలో రూ. 35 కోట్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక థియేటర్స్‌లోనూ భారీ కలెక్షన్స్ రాబడుతోంది. మొత్తంగా గ్యాప్ తీసుకొని వచ్చిన సమంతకు 'మా ఇంటి బంగారం'తో భారీ బ్లాక్ బస్టర్ దక్కింది.

# ఛావా డైరెక్టర్ మరో సినిమా



బాలీవుడ్ భామ శ్రద్ధా కపూర్ కీలక పాత్రలో వస్తోన్న లేటేస్ట్ మూవీ ఈత. స్త్రీ2 బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత ఆమె పీరియాడికల్ స్టోరీలో నటిస్తున్నారు. ఈ సినిమాకు ఛావా డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీలో రణ్‌దీప్ హుడా కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్ మేకర్స్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే విఠాబాయి భావు మాంగ్ నారాయణ్‌గావ్‌కర్ జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. బ్రిటీష్ కాలం నుంచే డ్యాన్సర్‌గా ఆమె ఎలాంటి పరిణామాలు ఎదుర్కొందనే కోణంలో ఈ మూవీ ఉండనుందని అర్థమవుతోంది. ఈ టీజర్‌లో నిండు గర్భిణిగా ఉన్న ఆమె డ్యాన్స్ చేయడం అంచనాలు పెంచుతోంది. ఈ టీజర్ చూస్తుంటే ఛావా మూవీలాగే మరో బ్లాక్‌బస్టర్ కొట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని మ్యాడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌లో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అజయ్‌అతుల్ సంగీతం అందించారు. ఈ చిత్రం ఆగష్టు 28, 2026న థియేటర్లలో విడుదల కానుంది.

'బంగారం'కి చిరు ఆశీర్వాదం..

# మెగా సర్‌ప్రైజ్ గిఫ్ట్



చాన్నాళ్ల తర్వాత 'మా ఇంటి బంగారం' అనే లేడీ ఓరియెంటెడ్ సినిమాతో వచ్చిన సమంత.. అద్భుతమైన సక్సెస్ అందుకుంది. కలెక్షన్స్ విషయంలో రూ.50 కోట్ల మార్క్ అందుకోగా.. ఇప్పుడు మూవీ టీమ్‌ని ఇంటికి పిలిపించుకున్న చిరంజీవి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. సమంత దంపతులు మెగా సర్‌ప్రైజ్ గిఫ్ట్ అందజేశారు. ఈ ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. సమంత ప్రధాన పాత్రలో నటించి, నిర్మించిన సినిమా 'మా ఇంటి బంగారం'. రాజ్ నిడిమోరుని పెళ్లి చేసుకున్న తర్వాత సామ్ నుంచి ఈ మూవీ వచ్చింది. దీనికి స్టోరీ రాజ్ అందించారు. నందిని రెడ్డి దర్శకురాలు. పెద్దగా అంచనాల్లేకుండానే థియేటర్లలోకి మంచి ఆదరణ దక్కించుకుంటోంది. అయితే సమంత దంపతుల్ని ఇంటికి పిలిపించుకున్న చిరు దంపతులు.. చీర, ప్రత్యేక బహుమతిని అందజేశారు. మరోవైపు సామ్ ప్రెగ్నెన్సీ గురించి చిరు లీక్ చేశారు. సినిమా, సమంత ఫెర్ఫార్మెన్స్ గురించి ట్వీట్ చేసిన చిరంజీవి.. చీరలో సమంత ఫైట్స్ అదరగొట్టేసిందని మెచ్చుకున్నారు. జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న రాజ్‌సమంత దంపతులకు ప్రత్యేక శుభాకాంక్షలు అని సామ్ ప్రెగ్నెన్సీ గురించి చిరు పరోక్షంగా బయటపెట్టేశారు. రీసెంట్‌గానే మూవీ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో సమంత బేబీ బంప్‌తో కనిపించింది. ఈ ఏడాది డిసెంబరులోనే బిడ్డకు జన్మనిచ్చే అవకాశముంది. కాకపోతే సమంత గానీ రాజ్ గానీ దీని గురించి అధికారికంగా చెప్పలేదు.



# ఆ విషయంలో మిమ్మల్ని నిరాశపరిచా.. క్షమించండి

కోలీవుడ్ స్టార్ సూర్య హీరోగా వచ్చిన లేటేస్ట్ మూవీ కరుప్పు. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద అదిరిపోయే కలెక్షన్స్ రాబట్టింది. ఈ సినిమా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ చిత్రానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించారు. తెలుగులో ఈ మూవీని వీరభద్రుడు పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ప్రస్తుతం ఈ సినిమా ఓటీటీలో సందడి చేస్తోంది. ఈ మూవీలో సూర్య నటనపై ప్రశంసలు కురిపించారు అయితే ఈ సినిమాలో కొన్ని విజువల్ ఎఫెక్ట్స్, సీజీఐ షాట్స్ ఓటీటీలో నిరాశపరిచాయని పలువురు ప్రేక్షకులు విమర్శిస్తున్నారు. వీటిపై దర్శకుడు ఆర్జే బాలాజీ స్పందించారు. తాజాగా ఓ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. విజువల్ ఎఫెక్ట్స్ సమస్య ఇప్పుడు వచ్చింది కాదు.. దీనిపై నేను చాలాసార్లు మాట్లాడానని అన్నారు. వీఎఫ్ఎక్స్‌లో లోపాలు ఉన్నమాట నిజమేనని అంగీకరించారు. ఈ సందర్భంగా ప్రేక్షకులకు క్షమాపణలు చెబుతూ.. భవిష్యత్ ప్రాజెక్టులలో మెరుగైన ఫలితాన్ని అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

వీఎఫ్ఎక్స్ గురించి వివరిస్తూ..' ఈ షాట్స్‌లో కొన్ని సన్నివేశాలు పూర్తి కావడానికి నెలల సమయం పడుతుంది. వాటి కోసం సీజీఐ కంపెనీలకు ముందస్తు చెల్లింపులు కూడా చేయాల్సి ఉంటుంది. కొన్ని చెల్లింపుల షెడ్యూళ్లను.. నిర్మాణ కాలపరిమితులను మా టీమ్ పాటించలేకపోయింది. అవే తుది ఫలితంపై ప్రభావం చూపాయి. 'సింగం' ఫైట్ సీక్వెన్స్ సీన్‌ను పూర్తి చేయడానికి మేము వీలైనన్ని తక్కువ షాట్‌లను ఉపయోగించాం. సినిమా ఓటీటీకి వచ్చాక ప్రేక్షకులు లోపాలను గమనిస్తారని మాకు ముందే తెలుసు ఓటీటీ విడుదల తర్వాత ప్రజలు ఎత్తి చూపినవి కొన్ని మాత్రమే. థియేటర్లలో చూసినట్లే ఓటీటీలో కూడా మమ్మల్ని ప్రశంసిస్తూ, సినిమాను ఆస్వాదిస్తున్నారు' అని అన్నారు.

ఈ చిత్రాన్ని ప్రధానంగా థియేటర్లో అనుభూతి కోసమే రూపొందించామని ఆర్జే బాలాజీ తెలిపారు. మీరు ప్రేక్షకుల మధ్య థియేటర్‌లో చూసినప్పుడే వీఎఫ్ఎక్స్ అనుభవాన్ని చూస్తారని అన్నారు. కొన్ని చిన్న చిన్న తప్పులు ఉన్నాయి.. కానీ ఆ తప్పులను పట్టించుకోకపోవడం కూడా సినిమాలో ఒక భాగమేనని ఆయన అన్నారు. ప్రేక్షకులకు కంటే ముందే మా తప్పుల గురించి తెలుసని అన్నారు. ఓటీటీ రిలీజ్ తర్వాత ప్రేక్షకులు పోస్ట్ చేస్తున్న స్క్రీన్‌షాట్‌ల కంటే.. నేను అంతకంటే చాలా ఎక్కువ స్క్రీన్‌షాట్‌లు తీసుకున్నానని తెలిపారు. ఇది ఒక పొరపాటు.. మిమ్మల్ని నిరాశపరిచినందుకు ఓటీటీ ప్రేక్షకులకు క్షమాపణలు చెబుతున్నా.. వచ్చేసారి మేము మరింత మెరుగ్గా చేస్తామని పేర్కొన్నారు.



# తమిళంలో వైష్ణవికి వరస ఛాన్స్‌లు

'బేబి' సినిమా అనగానే హీరోయిన్ వైష్ణవి చైతన్య గుర్తొస్తుంది. ఒక్క మూవీనే అయినప్పటికీ మంచి పేరు తెచ్చుకుంది. తర్వాత తెలుగులో ఒకటి రెండు చిత్రాలు చేసినప్పటికీ అవి డిజాస్టర్స్ అయ్యాయి. దీంతో ఫోకస్ అంతా తమిళంపై పెట్టింది. ఇంతకు ముందే అజిత్ హీరోగా నటించిన 'వలిమై'తో తమిళ ఎంట్రీ ఇచ్చింది కానీ అందులో చిన్న పాత్ర మాత్రమే చేసింది. ఇప్పుడు మాత్రం హీరోయిన్‌గా అవకాశాలు అందుకుంటోంది. సంగీత దర్శకుడు ,నటుడు జీవీ ప్రకాష్ కుమార్‌కు జంటగా వైష్ణవి నటిస్తోంది. చిత్రమైన సినిమాలు తీసే విఘ్నేష్‌కార్తీక్ ఈ ప్రాజెక్టుకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈయన ఇంతకు ముందు తిట్టం ఒండ్రు, అడియే, హాట్ స్పాట్ 1,2 మూవీస్ తెరకెక్కించారు. ఈ సినిమా ఇటీవలే చైన్నైలో ప్రారంభమై తొలి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. గత చిత్రాలకు భిన్నంగా దర్శకుడు విఘ్నేష్ కార్తీక్ దీనిని పూర్తి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నాడట. మరోవైపు ఆర్య హీరోగా నటిస్తున్న సినిమాలోనే వైష్ణవి చైతన్య ఓ హీరోయిన్‌గా చేస్తోంది.



# వీరభద్రుడి స్టోరీతో తెలుగు థ్రిల్లర్..

సూర్య హీరోగా చేసిన 'వీరభద్రుడు' గత నెలలో థియేటర్లలోకి వచ్చింది. పదిరోజుల క్రితం ఓటీటీలోకి కూడా వచ్చింది. ఇప్పుడు అదే వీరభద్రుడి బ్యాక్‌డ్రాప్ స్టోరీతో ఓ తెలుగు మిస్టరీ థ్రిల్లర్ సిరీస్ వచ్చేందుకు సిద్ధమైంది. ఈ మేరకు అధికారిక ప్రకటన చేశారు. ప్రోమో వీడియోని కూడా రిలీజ్ చేశారు. బంగారం గురించి ఆశ ఎక్కువైనప్పుడు.. మహిళ మీద మోజు పెరిగినప్పుడు.. కీర్తి కావాలనే ఆశ పెరిగినప్పుడు కలి పురుషుడు వస్తాడు అని చెబుతూ ఉన్న ప్రోమో అయితే బాగానే ఉంది. దీన్ని ఈ శుక్రవారం(జూన్ 19) నుంచి జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్ చేయనున్నారు. మొత్తం 60 ఎపిసోడ్ల సిరీస్‌గా ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రతివారం ఒకటి రెండు ఎపిసోడ్స్ అందుబాటులోకి వస్తాయి.తెలుగులో బాలనటిగా గుర్తింపు తెచ్చుకున్న ఆని, రఘుకుంచె తదితరులు ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు. మరి థ్రిల్లర్ సిరీస్ కాబట్టి కచ్చితంగా ఇంట్రెస్టింగ్‌గా ఉండాలి. లేదంటే ప్రేక్షకులు లైట్ తీసుకునే అవకాశముంది. ఇలా 60 అంతకంటే ఎక్కువ ఎపిసోడ్ల తరహాలోనే హాట్‌స్టార్‌లో పలు సిరీస్‌లు ఇప్పటికే స్ట్రీమింగ్ అవుతున్నాయి.

# ఇది జీవితాంతం మర్చిపోను

హిందీ నటి అయినప్పటికీ మృణాల్ ఠాకుర్.. సీతారామం, హాయ్ నాన్న లాంటి కొన్ని సినిమాలు చేసి తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్‌గా అయితే 'డెకాయిట్'తో వచ్చింది. ఇందులో ఈమె యాక్టింగ్ బాగుందని అంతా మెచ్చుకున్నారు గానీ మూవీ మాత్రం జనాలకు పెద్దగా నచ్చలేదు. సరే ఈ సంగతులు పక్కనబెడితే తమ్ముడి గ్రాడ్యుయేషన్ కోసం అమెరికా వెళ్లిన మృణాల్.. ఎమోషనల్ అయిపోయింది. ఈ మేరకు ఓ వీడియో పోస్ట్ చేసింది. 'నువ్వు సాధించిన విజయం చూస్తుంటే నాకెంతో ఆనందంగా ఉంది. నువ్వు మంచి వ్యక్తిగా రూపుదిద్దుకుంటున్న విధానం నన్ను గర్వపడేలా చేస్తున్నాయి. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినందుకు అభినందనలు. గ్రాడ్యుయేషన్ వేడుక చాలా బాగా జరిగింది. అది చూస్తున్నప్పుడు మూవీ సీన్‌లో ఉన్నట్లు అనిపించింది. ఈ అనుభూతిని నేను జీవితాంతం మర్చిపోలేను' అని మృణాల్ చెప్పుకొచ్చింది. మృణాల్ తమ్ముడు మందార్ ఠాకుర్.. అమెరికాలోని చికాగోలో మాస్టర్స్ పూర్తిచేశాడు. ఈమె పోస్ట్ చేసిన వీడియోలో అతడిని చూడొచ్చు.





# బంగారాన్ని ఆకాశానికెత్తేసిన నయన్

స్టార్ హీరోయిన్ల మధ్య ఈగోనే తొంగి చూస్తుంది కానీ సఖ్యత, స్నేహం ఉండటం అరుదు. ఇటీవల కాలంలో ఆ మార్పు వచ్చిందనే చెప్పొచ్చు. అందుకు ఉదాహరణ సమంత, నయనతారలే. వీరిద్దరూ స్టార్ హీరోయిన్లే. ఇద్దరు నిర్మాతలే. అత్యంత భారీ పారితోషికం తీసుకుంటున్నట్లు నటి నయనతార. ఇంతకు ముందు తమిళం, తెలుగు భాషల్లో స్టార్ హీరోలతో జోడీ కట్టిన నటి సమంత. కాగా సమంత లీడ్ రోల్ చేసి, నిర్మించిన సినిమా 'మా ఇంటి బంగారం'. నందిని రెడ్డి దర్శకురాలు. తమిళంలోనూ 'ఎంగల్ తంగం' పేరుతో రిలీజ్ చేశారు. ఈ చిత్ర విజయాన్ని పురస్కరించుకుని నయనతార.. సమంతని అభినందనలతో ముంచెత్తింది. నయన్ తన ఇన్‌స్ట్రాలో.. 'నీ కారణంగా నేను చాలా సంతోషపడుతున్నా సామ్. అభిమానానికి, విజయానికి నువ్వు అన్ని విధాలుగా పూర్తిగా అర్హురాలివి. మా ఇంటి బంగారం చిత్ర యూనిట్‌కు నా శుభాకాంక్షలు' అని రాసుకొచ్చింది. కాగా ఇంతకు ముందు నయనతార సొంతంగా నిర్మించి, నటించిన 'కాత్తువాక్కుల రెండు కాదల్' మూవీలో సమంత మరో హీరోయిన్‌గా చేసింది. సమంత త్వరలో 'రక్త బ్రహ్మాండ' పేరుతో ఓ వెబ్ సిరీస్ చేయాలి. అయితే ఇది జరుగుతుందా లేదా అనేది ఇప్పటికైతే అప్డేట్ లేదు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com